ఉండ్రుగొండ చారిత్రక సందర్శనీయ క్షేత్రం: కలెక్టర్

చివ్వెంల, న్యూస్‌టుడే: ఎత్తైన కొండల మధ్య పచ్చిక బయళ్లు చుట్టూ వివిధ రాతి ప్రాకారాలు, దేవాలయాలు, కోనేర్లు ప్రత్యేకత సంతరించుకున్న ఉండ్రుగొండ గిరిదుర్గం చరిత్రాత్మక సందర్శనీయ ప్రాంతమని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. ఉండ్రుగొండను అధికారులతో కలిసి బుధవారం సందర్శించారు. సుమారు 1500 ఎకరాల విస్తీర్ణం కలిగిన ఉండ్రుగొండను పురాతన కాలం నుంచి వివిధ రాజులు తమ ఆవాసాలుగా చేసుకొని ఏలిన విషయాలను కలెక్టర్‌కు తెలియజేశారు. బయోస్కోప్ ద్వారా సుదూర ప్రాంతాల్లో ఉన్న రాతి కట్టడాలు, ప్రాకారాలను వీక్షించారు. పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని కలెక్టర్ హామీ ఇచ్చారు. ఆర్డీవో వేణుమాధవ్, డీఎఫ్‌వో సతీష్‌కుమార్, డీపీఆర్వో రమేష్, తహసీల్దార్ కృష్ణయ్య, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు ఆదుర్తి రామయ్య, రవిచంద్ర, కృష్ణకుమార్‌లు పాల్గొన్నారు.



ఉండ్రుగొండ గిరిదుర్గాన్ని సందర్శించి గుట్టల మధ్య నడుస్తున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

కేసుల దర్యాప్తులో మెలకువలు నేర్చుకోవాలి: ఏఎస్పీ



సూర్యాపేటలో డ్యూటీ నిర్వహిస్తున్న అదనపు ఎస్పీ నాగేశ్వరరావు తదితరులు

సూర్యాపేట నేరవిభాగం, న్యూస్‌టుడే: దోషులకు శిక్షలు పడాలంటే కేసుల్లో సరైన ఆధారాలు, దర్యాప్తులో మెలకువలు నేర్చుకునేందుకు పోలీసు డ్యూటీ మీట్ దోహదం చేస్తుందని అదనపు ఎస్పీ నాగేశ్వర రావు అన్నారు. జిల్లా స్థాయి పోలీసు డ్యూటీ మీట్‌ను బుధవారం జిల్లా కేంద్రంలో ప్రారంభించి మాట్లాడారు. జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభ చూపిన వారిని జోనల్ స్థాయిలో జరుగనున్న డ్యూటీ మీట్‌కు పంపించనున్నట్లు తెలిపారు. పోలీసుల నైపుణ్యం, ప్రతిభ ప్రదర్శనకు లభించే అవకాశాన్ని అధికారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏఆర్ హెడ్ క్వార్టర్‌లో డాగ్, బాంబ్ స్క్వాడ్ సిబ్బందికి పోటీలు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా యాభై మంది పోలీసు అధికారులు హాజరయ్యారు. ఏఆర్ అదనపు ఎస్పీ జనార్దన్‌రెడ్డి, డీసీఆర్బీ డీఎస్పీ మట్టయ్య, ఇన్‌స్పెక్టర్ రాజేశ్, స్పెషల్ బ్రాంచి ఇన్‌స్పెక్టర్ వీర రాఘవులు, ఆర్ఐలు నారాయణరాజు, నరసింహ పాల్గొన్నారు.

30 నుంచి మట్టపల్లిలో పవిత్రోత్సవాలు

మఠంపల్లి, న్యూస్‌టుడే: మట్టపల్లి శ్రీలక్ష్మీనృసింహుని ఆలయంలో వార్షికంగా నాలుగు రోజుల పాటు నిర్వహించే పవిత్రోత్సవాలు ఈనెల 30 నుంచి ప్రారంభం కానున్నాయి. శ్రీస్వామి సన్నిధిలో వివిధ సందర్భాలలో జరిగే దోషాలకు ప్రాయశ్చిత్తంగా ప్రతి సంవత్సరం ఈ పవిత్రోత్సవాలు నిర్వహిస్తారు. సదాచార సంపన్నుల సారథ్యంలో నూలుతో తయారయ్యే పవిత్రాలను తమిళనాడులోని శ్రీరంగం నుంచి అక్కడి శ్రీస్వాతీ నక్షత్ర మహాయజ్ఞ ట్రస్ట్ ఛైర్మన్ ఎంఎల్ శ్రీనివాసన్ పంపడం దశాబ్దాలుగా ఆనవాయితీగా వస్తోంది. అక్టోబరు 3 వరకు జరిగే పవిత్రోత్సవాల వివరాలను ధర్మకర్తలు చెన్నూరు విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈవో సిరికొండ నవీన్ బుధవారం తెలిపారు. 30న సాయంత్రం అనుజ్ఞాస్వీకారం, అఖండ దీపారాధన, పంచగవ్య ఆరాధన, మేదినీ పూజ, అంకురారోపణ ఉంటాయి. 1న అగ్నిమథనం, అకల్మష హోమం, పవిత్రాల శుద్ధి, సుదర్శన యంత్రస్థాపన నిర్వహిస్తారు. 2న శతకలశ స్నపన, సుముహూర్త కాలంలో ఆలయ ప్రాకారాలు, గోపురాలతో పాటు ఉపాలయాల్లోని పరివార దేవతలకు పవిత్రారోపణం, మూలమంత్ర హోమాలు చేపడతారు. 3న మహాశాంతి హోమం, పూర్ణాహుతి, పవిత్రవిసర్జనోత్సవం, శాంతి కల్యాణంతో పవిత్రోత్సవాలు పరిసమాప్తమవుతాయి.



పవిత్రోత్సవాలలో విశేష క్రతువులు నిర్వహించేందుకు ఏర్పాటు చేసిన మేరుపర్వత సహిత హోమ కుండలాలు

బస్సు కావాలి..!

మిర్యాలగూడ నుంచి హైదరాబాద్ మార్గంలో మధ్యాహ్నం 1.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ఎక్స్‌ప్రెస్ బస్సులు లేవు. దీంతో మహిళా ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.

నల్గొండ నుంచి హైదరాబాద్‌కు సైతం ఎక్స్‌ప్రెస్ బస్సులు తక్కువగా ఉండడంతో.. కోదాడ నుంచి వచ్చే బస్సుల కోసం మహిళలు గంటల తరబడి వేచి చూడాల్సి వస్తోంది.

మునుగోడు నియోజకవర్గానికి ఆర్టీసీ బస్సు రవాణాను పెంచేందుకు 21 మార్గాల్లో బస్సులు నడపాలని స్థానిక ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి రాష్ట్ర రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్‌కు విన్నవించారు.



మిర్యాలగూడ ఆర్టీసీ బస్టాండ్

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే:

మహాలక్ష్మి పథకంలో భాగంగా ఆర్టీసీ పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం ప్రారంభించిన నాటి నుంచి ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరిగింది. గతంలో ఉమ్మడి జిల్లాలో 60 శాతం ఉన్న ఓఆర్.. ప్రస్తుతం 100పైగా పెరిగింది. పండగలు, సెలవు దినాల్లో 120కి పైగా ఓఆర్ నమోదవుతుంది. ఈ నేపథ్యంలో కరోనా అనంతరం రద్దయిన అనేక మార్గాలతో పాటు పలు కొత్త మార్గాలకు సైతం బస్సులు నడపాలనే డిమాండ్లు పెరుగుతున్నాయి. ప్రస్తుతం అందుబాటులో ఉన్న వాటితోనే.. ప్రధాన మార్గాలకు బస్సులు నడుపుతుండగా.. ఆయా మార్గాల్లోనే సర్వీసుల సంఖ్య పెంచాల్సిన అవసరం ఉంది.

అదనంగా అవసరం..

పాత మార్గాల పునరుద్ధరణ, కొత్త మార్గాలు, ప్రస్తుత మార్గాల్లో అదనపు సర్వీసుల కోసం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 200కు పైగా బస్సులు అవసరం పడనున్నాయి. వీటిలో మిర్యాలగూడ డిపోకు సుమారుగా 35, దేవరకొండకు 25, కోదాడకు 25, నల్గొండకు 30, సూర్యాపేటకు 35, యాదగిరిగుట్టకు 25, నార్కట్‌పల్లి డిపోకు 30 బస్సులు అదనంగా కావాలని స్థానిక నాయకులు, ప్రయాణికులు కోరుతున్నారు.

పాతవి మార్చాలి..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇటీవల 79 కొత్త బస్సులు వచ్చాయి. ఇప్పటికే ఉన్న బస్సుల్లో 43 బస్సులను మార్చాల్సిన అవసరం ఉంది. నిబంధనల ప్రకారం 12 లక్షల కిలో మీటర్లు తిరిగిన, 15 ఏళ్లు దాటిన బస్సులను తుక్కుగా మార్చాల్సిన అవసరం ఉంది. బస్సుల లేమి కారణంగా తీసెయ్యాల్సిన బస్సులను సైతం నడిపిస్తున్న పరిస్థితి నెలకొంది. నల్గొండ డిపోకు ఇటీవలే కొత్త రాజధాని బస్సు రాగా.. మిర్యాలగూడ డిపోలో ఉన్న పాత రాజధాని బస్సు తరచూ మొరాయిస్తుంది. ఇటువంటి బస్సుల వల్ల నిర్వహణ ఖర్చు అధికమవుతుందని మెకానిక్‌లు చెబుతున్నారు. వీటి స్థానంలో కొత్త బస్సులను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

ఉమ్మడి జిల్లాలో డిపోల వారీగా ఉన్న బస్సులు, కొత్తగా వచ్చిన వాటి వివరాలు..

డిపో	పల్లెవెలుగు	ఎక్స్‌ప్రెస్	డీలక్స్	సూపర్ లగ్జరీ	రాజధాని	కొత్త బస్సులు
దేవరకొండ	35	27	5	2	0	12
నల్గొండ	29	1	50	0	1	16
నార్కట్‌పల్లి	4	0	0	0	0	2
మిర్యాలగూడ	22	2	8	33	1	8
యాదగిరిగుట్ట	36+21 (మినీ)	16	0	0	0	10
కోదాడ	20	10	11	13	0	8
సూర్యాపేట	28	28	0	0	0	23

కొత్త బస్సులతో పాటు డ్రైవర్ల కోసం ప్రతిపాదనలు..

– రాజశేఖర్, ఆర్ఎం, నల్గొండ

ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా మరో 40 నూతన బస్సులకు ప్రతిపాదనలు పంపించాం. వీటితో పాటు 200 మంది డ్రైవర్ల నియామకానికి సైతం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం. పాత మార్గాల నుంచి వినతులు వస్తున్నందున ఆదాయాన్ని బట్టి ఆయా మార్గాల్లో బస్సులు నడిపే అంశాన్ని సైతం పరిశీలించనున్నాం.

కుటుంబ సభ్యుల నిర్ధారణ పూర్తికావొచ్చింది: శ్రీధర్‌రెడ్డి

నేరేడుచర్ల, న్యూస్‌టుడే: రుణమాఫీకి సంబంధించి రేషన్ కార్డులు లేని వారి కుటుంబ సభ్యుల నిర్ధారణ దాదాపు పూర్తికావచ్చిందని, జిల్లాలో 29,608 కుటుంబాల వివరాలు నమోదు చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు 20,026 మంది నమోదు చేసుకున్నారని జిల్లా వ్యవసాయాధికారి(జేడీఏ) జి.శ్రీధర్‌రెడ్డి తెలిపారు. నేరేడుచర్ల మండలం చిల్లేపల్లి, దిర్శించర్ల పంచాయతీల పరిధిలో బుధవారం ఆయన పర్యటించి వర్షాల వల్ల జరిగిన పంట నష్టం, వరిలో సన్న, దొడ్డురకాల సాగును పరిశీలించారు. చిల్లేపల్లిలో సాగు చేసిన వరి పొలాల్లో కాండం కుళ్లు తెగులు ఉన్నట్లు గుర్తించి నివారణ చర్యలను రైతులకు తెలియజేశారు. రుణమాఫీ మూడు విడతల్లో 1,00,503 మంది రైతులకు రూ.845.54 కోట్లు ప్రభుత్వం జమ చేసిందన్నారు. రూ.2 లక్షలపైన రుణం ఉన్న రైతులు ప్రభుత్వం చెప్పినప్పుడు అదనంగా ఉన్న మొత్తం జమ చేయాలని చెప్పారు. ఆయన వెంట మండల వ్యవసాయాధికారి షేక్ జావేద్, ఏఈవో నిర్మల, రైతులు పాల్గొన్నారు.



చిల్లేపల్లి వరి పొలాల్లో తెగులు నివారణకు సూచనలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి శ్రీధర్‌రెడ్డి

పల్లె అందాలు చూసొద్దామా..!

సందర్శించే ప్రాంతాలు

- పులిచింతల జలాశయం (చింతలపాలెం)
- లింగమంతుల స్వామి దేవాలయం (దురాజ్‌పల్లి)
- బుద్ధిస్టు మ్యూజియం (ఫణిగిరి, నాగారం)
- మూసీ జలాశయం
- ఉండ్రుగొండ గుట్టలు (చివ్వెంల)
- శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయాలు (మట్టపల్లి, అర్వపల్లి)
- జన్‌పహాడ్ దర్గా (పాలకవీడు)
- అనంత పద్మనాభ స్వామి దేవాలయం (బూరుగడ్డ, హుజూర్‌నగర్)



సూర్యాపేట: పర్యాటక ప్రాంతాలకు వెళ్తున్న బస్సును ప్రారంభిస్తున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, అధికారులు

సూర్యాపేట పట్టణం, న్యూస్‌టుడే: విద్యార్థులకు జిల్లాలోని పర్యాటక ప్రదేశాలు, వాటి చరిత్ర వివరించేందుకు అధికార యంత్రాంగం సన్నద్ధమవుతోంది. "మన ఊరి ప్రకృతి అందాలు... మనం చూశామా" కార్యక్రమాన్ని చేపట్టేందుకు జిల్లా పాలనాధికారి తేజస్ నందలాల్ పవార్ ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటున్నారు. ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలో టూరిజం వీక్ సందర్భంగా హెరిటేజ్ వాక్ కార్యక్రమాన్ని తలపెట్టారు. నిర్ణయించిన పర్యాటక ప్రదేశాలకు పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కళాశాలల విద్యార్థులకు తరలించేందుకు ఏర్పాటు చేపట్టారు. పట్టణంలోని శ్రీ మేధా, నారాయణ, శ్రీనిధి, శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర, ఎస్ఆర్, ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులను పర్యాటక ప్రాంతాలకు తీసుకెళ్లారు. తొలి రోజు బుధవారం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు వెళ్లగా... ఈ బస్సులను కలెక్టర్, డీఐఈవో భాను నాయక్‌లు ప్రారంభించారు. మరో రెండు రోజుల పాటు ఆయా కళాశాలల విద్యార్థులను తరలించేలా కార్యాచరణ రూపొందించారు. జిల్లాలోని ఆయా ప్రాంతాల్లో చరిత్ర తెలిసిన గైడ్‌ను వెంట పంపించనున్నారు. దీంతో ప్రాంతం ప్రాముఖ్యం కూడా తెలుస్తోంది. కోనేరులో దిగొద్దని, కోతుల ఉన్న ప్రాంతాల్లో గుంపులుగా వెళ్లాలని సూచించారు.

నిధులు నిలిచి.. పనులు పడకేసి..!

సూర్యాపేట పురపాలిక, న్యూస్‌టుడే: పురపాలికలకు పట్టణ ప్రగతి నిధులు విడుదల కావడం లేదు. దీంతో పురపాలికలు పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు ఇబ్బందులు పడుతున్నాయి. రహదారులు, మురుగు కాల్వలు, ఇతర పనులు చేపట్టలేక పుర అధికారులు చేతులెత్తేశారు. ప్రతి నెల పురపాలికలకు రూ.లక్షల నిధులు విడుదల కావాల్సి ఉండగా.. గతేడాది జూన్ నుంచి రావడం లేదు. పలు మార్లు పుర అధికారులు ఉన్నతాధికారులకు విన్నవించినా ఫలితం లేకుండాపోయింది.

ఇదీ పరిస్థితి

సూర్యాపేట జిల్లాలో ఐదు పురపాలికలు ఉన్నాయి. సూర్యాపేట పురపాలికకు గతేడాది జూన్ నుంచి ప్రతి నెలా రూ.46.50 లక్షల నిధులు రావడం లేదు. 14 నెలల నుంచి మొత్తం రూ.6,51,00,000 పట్టణ ప్రగతి నిధులు రాకపోవడంతో అభివృద్ధి పనులు చేసేందుకు అధికారులు ఇబ్బందులు పడుతున్నారు.

- ❑ కోదాడ పురపాలికకు కూడా గతేడాది జూన్ నుంచి పట్టణ ప్రగతి నిధులు రావటం లేదు. ప్రతి నెలా రూ.6,60,000 నిధులు రావాల్సి ఉంది.
- ❑ హుజూర్‌నగర్ పురపాలికకు గతేడాది డిసెంబరు నుంచి ప్రతి నెలా రూ.17 లక్షల నిధులు రావాల్సి ఉంది. కానీ నేటికీ ఒక్క పైసా రాలేదు.
- ❑ నేరేడుచర్ల పురపాలికకు 2023 ఆగస్టు నుంచి ప్రతి నెలా రూ.6,01,796 నిధులు రావాల్సి ఉంది. 13 నెలలుగా మొత్తం రూ.78,23,348 లక్షల నిధులు పెండింగ్‌లో ఉన్నాయి.
- ❑ తిరుమలగిరి పురపాలికకు గతేడాది జూన్ నుంచి నిధులు రావటం లేదు. ప్రతి నెలా రూ.8.9 లక్షల నిధులు రావాల్సి ఉంది. 14 నెలలుగా మొత్తం నిధులు రూ.1,24,60,000 పెండింగ్‌లో ఉన్నాయి.



సూర్యాపేటలోని శ్రీరాంనగర్‌లో నిధుల లేమి కారణంగా సీసీగా నిర్మించని రహదారి

ఉన్నతాధికారులకు విన్నవించాం

శ్రీనివాస్, పుర కమిషనర్, సూర్యాపేట

పురపాలికకు పట్టణప్రగతి నిధులు రావడం లేదు. గతేడాది జూన్ నుంచి నిధులు రాకపోవటంతో ఉన్నతాధికారులకు విన్నవించాం. నేటికీ ఒక్క పైసా కూడా విడుదల కాలేదు. మరోసారి విన్నవించి విడుదల చేయాలని కోరుతాం.

యాదాద్రి క్షేత్రంలో హోమం.. కల్యాణం

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: యాదాద్రి పుణ్యక్షేత్రంలో బుధవారం స్వయంభువులైన శ్రీలక్ష్మీనరసింహ మూర్తులను కొలుస్తూ చేపట్టిన నిత్యారాధనలు ఆలయ ఆచారంగా కొనసాగాయి. సూర్యోదయానికి ముందస్తు వేళ సుప్రభాతం చేపట్టిన పూజారులు, రాత్రి శయనోత్సవం నిర్వహించారు. బిందెతీర్థం, హారతి, బాలభోగం నివేదించారు. మూలవరులకు హారతినిచ్చి నిత్యపూజలు జరిపి, పంచామృతంతో అభిషేకం, తులసీ దళాలతో అర్చన చేపట్టారు. శ్రీలక్ష్మీనరసింహస్వామి కవచమూర్తులకు సువర్ణ పుష్పార్చన జరిపారు.

ఉరుములు, మెరుపులతో వర్షం

సూర్యాపేట కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో బుధవారం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ప్రస్తుతం కురుస్తున్న వానలతో పంటలకు తీరని నష్టం చేకూరుతోంది. పత్తి తీత మొదలవుతుండటం, రోజుల తరబడి వర్షం కురవడంతో పత్తి కాయలు కుళ్లిపోయే ప్రమాదం ఉంది. దీనికి తోడు చీడపీడల బెడద అధికంగా ఉంటుంది. అంతేకాకుండా ప్రస్తుతం వరి పంటకు ఉష్ణోగ్రత అందాల్సి ఉంది. కానీ ఈ వర్షాలతో వరికి నష్టం చేకూరుతోంది. జిల్లా వ్యాప్తంగా 2.4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యధికంగా జాజిరెడ్డిగూడెం 27.5 మి.మీ, సూర్యాపేటలో 24.5 మి.మీ, నాగారంలో 1.4 మి.మీ, తిరుమలగిరి 1.3, చివ్వెంలలో 0.4 వర్షం కురిసింది.

కోతిబంధం ఆనకట్ట అభివృద్ధికి చర్యలు

స్పందనకు వందనం




కోతిబంధం గండిలోకి దిగి లోతును పరిశీలిస్తున్న చిన్న నీటిపారుదలశాఖ డీఈ హరికృష్ణ

నూతనకల్, న్యూస్‌టుడే: మూడు గ్రామాల చెరువులు, కుంటలకు గొలుసు కట్టు కాలువ ద్వారా వరదనీటిని అందించే తాళ్లసింగారంలోని కోతిబంధం ఆనకట్టకు గండిపడి కాలువకు నీరు నామ మాత్రంగా వస్తున్నాయి. దీనిపై 'ఈనాడు'లో 'కోతిబంధం ఆనకట్టకు గండి' శీర్షికన బుధవారం ప్రచురితమైన కథనానికి చిన్ననీటిపారుదలశాఖ డీఈ హరికృష్ణ స్పందించారు. తాళ్లసింగారం గ్రామశివారులో వాహనాలు నిలిపి కిలోమీటర్ దూరం కాలి నడకన వెళ్లి పది అడుగుల లోతు ఏటిలోకి దిగి ఈదుకుంటూ గండిపడ్డ ప్రదేశానికి చేరుకున్నారు. రైతు సహకారంతో ఏటిలోకి దిగి లోతును గుర్తించారు. కోతిబంధం ఆనకట్టకు పూర్వవైభవం తీసుకురావడానికి జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి ఆనకట్ట అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని డీఈ వివరించారు. శ్రమించి ప్రమాదమని తెలిపినా ఆనకట్ట ఉన్నతికి క్షేత్రపరిశీలన చేసిన డీఈకి రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రణాళిక ప్రకారం వారోత్సవాలు నిర్వహించాలి

సూర్యాపేట కలెక్టరేట్, న్యూస్‌టుడే: అంతర్జాతీయ వయో వృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని వృద్ధుల గౌరవం, శ్రేయస్సుపై వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు జిల్లా సంక్షేమ శాఖ అధికారి నర్సింహారావు తెలిపారు. దీనికి సంబంధించి కరపత్రాలను బుధవారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించి మాట్లాడారు. సెప్టెంబరు 26 నుంచి అక్టోబరు 1 వరకు వారం పాటు నిర్వహించే కార్యక్రమాలను ప్రణాళిక ప్రకారం నిర్వహించాలని వెల్లడించారు. 26న వృద్ధాశ్రమంలో వృద్ధులకు క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాలు, 27న వాకథాన్ ర్యాలీ, 28న తల్లిదండ్రుల పోషణ, సంక్షేమ చట్టం-2007, ఆరోగ్య సంరక్షణపై అవగాహన సదస్సు, 29న గ్రామ పంచాయతీల్లో తల్లిదండ్రుల పోషణ, సంరక్షణ-2007పై అవగాహన, టోల్ ఫ్రీ నెంబర్ 14567పై సదస్సు, 30న అంగన్‌వాడీ కేంద్రాల్లో గ్రాండ్ పేరెంట్స్ డే నిర్వహణ, 1న జిల్లా స్థాయిలో అంతర్జాతీయ వృద్ధులు దినోత్సవం కార్యక్రమం ఉంటుందన్నారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అర్రె రామకృష్ణారెడ్డి, విద్యాసాగర్, హమీద్ ఖాన్, భాస్కరాచారి, సుధాకర్, హుస్సేన్, వినోద్ పాల్గొన్నారు.

భరోసాతో.. దసరా పండగేనా..!



అడవిదేవులపల్లిలో సాగు చేసిన పత్తిచేను

అడవిదేవులపల్లి, న్యూస్‌టుడే: తమ ప్రభుత్వ హయాంలో భారాస రైతులకు ఖరీఫ్, రబీ సీజన్లలో పంట సాయం కోసం రైతుబంధు పథకాన్ని ప్రవేశపెట్టింది. కాంగ్రెస్ ప్రభుత్వం దాన్ని రైతు భరోసాగా మార్పు చేసింది. ఈ పథకం కింద ఆర్థిక సాయం జులైలోనే అందించాల్సి ఉండగా.. పలు కారణాల వల్ల తాత్సారం చేస్తూ వచ్చింది.


- ఆగస్టు 15 నుంచి రుణమాఫీ మూడు విడతలుగా చేసినా.. ఇంకా చాలా మంది రైతులకు సొమ్ము అందలేదు. మాఫీ అయిన వారికి సైతం చాలా వరకు ఇంకా బ్యాంకుల చుట్టూ తిరిగినా రుణాలు ఇవ్వలేదని రైతులు చెబుతున్నారు. ఈ క్రమంలో అక్టోబరులో రైతుభరోసా ఇవ్వనున్నామని ప్రభుత్వ పెద్దలు అంటుండడంతో రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఖరీఫ్ సీజన్ పంట కాలం మరో 15 రోజుల్లో ముగియనుంది. పంట మొదట్లో ఇవ్వాల్సిన ఆర్థిక సాయం కనీసం చివర్లోనైనా ఇస్తే బాగుండని ఉమ్మడి జిల్లాలోని 23.73 లక్షల మంది రైతుల ఎదురుచూస్తున్నారు.

పెరుగుతుందన్న ఆశ

అధికారంలోకి వస్తే ఎకరాకు రూ.15వేల రైతుభరోసా ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. ఎన్నికల సమయంలో గత ప్రభుత్వం రైతు భరోసా ఇవ్వడానికి నిధులు సిద్ధం చేయగా ఎన్నికల సంఘం నిలిపివేసింది. ఇక అప్పటి నుంచి రైతు భరోసా రైతులకు అందలేదు.

- తాజా ప్రభుత్వం దసరాకు భరోసా ఇస్తామంటోంది. ప్రస్తుతం మరో నెల రోజుల్లో రబీ సీజన్ కూడా మొదలవుతోంది. రెండు పంటలవి కలిపి ఎకరాకు రూ.15వేలు జమ చేస్తుందా లేక ఖరీఫ్‌వి మాత్రమే జమ చేస్తుందా అన్న దానిపై స్పష్టత లేదు.

ఉమ్మడి జిల్లాలో ఖరీఫ్‌లో సాగు చేసిన రైతులు, సాగు విస్తీర్ణం వివరాలు..



మార్గదర్శకాలపై ఆందోళన

ఇక ప్రభుత్వం రైతు భరోసా నిధుల జమకు సంబంధించిన మార్గదర్శకాలు ఏ విధంగా ఉండబోతున్నాయనే దానిపై రైతులు ఆందోళనలో ఉన్నారు. ముఖ్యంగా సన్నకారు రైతులకు ఎలాంటి ఢోకా లేకున్నా పెద్దకారు రైతుల్లో మాత్రం ఆందోళన ఉంది. కటాఫ్ ఎన్ని ఎకరాలు ఉండబోతుందో అన్న సందేహాలున్నాయి.

- ప్రభుత్వం పదెకరాల్లోపు ఉన్న రైతులకు మాత్రమే ఇస్తే మిగతా వారికి రైతు భరోసా దూరం కానుంది. ప్రభుత్వ ఉద్యోగులుగా పనిచేస్తున్నవారికి కూడా రైతు భరోసా కోత పెట్టాలన్న యోచనతో ప్రభుత్వం ఉందని రైతులు భావిస్తున్నారు. ఇలాంటి వాటన్నిటికీ నెలాఖరులోపు స్పష్టత వచ్చే అవకాశం ఉందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

విద్యుత్తు సరఫరాలో అంతరాయం రానివ్వం: ఎస్ఈ ఫ్రాంక్లిన్

మేళ్లచెరువు, న్యూస్‌టుడే: జిల్లాలో విద్యుత్తు సరఫరాలో అంతరాయం కలగకుండా తగు చర్యలు చేపడుతున్నట్లు ఎస్ఈ ఫ్రాంక్లిన్ అన్నారు. కందిబండ విద్యుత్తు ఉపకేంద్రంలో రూ.1.20 కోట్ల విలువ గల నూతన 8 ఎంవీఏ పీటీఆర్‌ను బుధవారం ప్రారంభించిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. రాబోయే ఐదేళ్ల వరకు దీనికింద విద్యుత్తు ఇబ్బందులుండవన్నారు.

- ✦ జిల్లాలో గృహజ్యోతి కింద ప్రతినెలా రూ.6 కోట్ల విలువైన డిమాండ్ ఉందన్నారు. ఇటీవల వరద బీభత్సం వల్ల ఎల్సీ తప్పనిసరైందని పేర్కొన్నారు. దానివల్ల సరఫరాకు అంతరాయం ఏర్పడిందన్నారు. హుజూర్‌నగర్ డివిజన్‌లో ఈ వరదల వల్ల 425 నియంత్రికలు, 3,700 స్తంభాలు దెబ్బతిన్నాయన్నారు. మొత్తమ్మీద రూ.7.50 కోట్లు నష్టం వాటిల్లిందన్నారు. రైతులు, ఇతర వినియోగదారులకు ఇబ్బందుల్లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాటు చేశామన్నారు.
- ✦ జిల్లాలో 8,600 వ్యవసాయ కనెక్షన్లు ఉండగా.. ఒక్క హుజూర్‌నగర్ డివిజన్‌లోనే 5,700 డీడీలకు సంబంధించి పంపుసెట్లకు ఇంకా కనెక్షన్లివ్వాల్సి ఉందన్నారు. వానాకాలం తొలి రోజుల్లో సాగర్ నిండకపోయేసరికి డిమాండ్ పెరిగిందన్నారు. వ్యవసాయానికి 40 మిలియన్ యూనిట్లు డిమాండ్ ఉందన్నారు.
- ✦ విద్యుత్ లోవోల్టేజీ నివారణకు కొత్తగా ఈ ప్రభుత్వంలో చెన్నాయిపాలెం, బక్కమంతులగూడెం, ముకుందాపురం, బాలాజీనగర్‌లలో నూతన విద్యుత్ ఉప కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. కూచిపూడి, కొండాపురం, మూసిఒడ్డు సింగారం ప్రాంతాల్లో రూ.5 కోట్లతో ప్రతిపాదనలు పంపామన్నారు.
- ✦ డీఈ ఆపరేషన్స్ వెంకటక్రిష్ణయ్య, డీఈ టెక్నికల్ దాలి నాయుడు, ఏడీఈ ఇందిర, ఏఈ వెంకటేశ్వర రెడ్డి పాల్గొన్నారు.

ఎంఈవోలు వచ్చేశారు..!

మద్దిరాల గ్రామీణం, న్యూస్‌టుడే: నాలుగైదు మండలాలకు ఒక్కరే ఎంఈవోగా పనిచేస్తున్న విధానానికి ప్రభుత్వం స్వస్తి పలికింది. మండల నోడల్ అధికారులుగా ఉన్న సీనియర్ జీహెచ్ఎంలకే మండల విద్యాధికారులుగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో పర్యవేక్షణ మెరుగుపడి విద్యావ్యవస్థ గాడిలో పడే అవకాశముందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. 2005 తర్వాత ఎంఈవోల నియామకం నిలిచిపోయింది.

మండలాల వారీగా..

అనంతగిరి	శ్రీనివాసరావు
చిలుకూరు	గురవయ్య
చింతలపాలెం	ఎన్. శ్రీనివాస్
చివ్వెంల	జీ.కళ్యాణి
హుజూర్‌నగర్	భుక్యా సైదానాయక్
మద్దిరాల	తండు వెంకటనారాయణ
మఠంపల్లి	వెంకటచారి
మేళ్లచెర్వు	వెంకట్‌రెడ్డి
మునగాల	వెంకటేశ్వర్లు
నడిగూడెం	ఉపేందర్‌రావు
నాగారం	ప్రభాకర్
నేరేడుచర్ల	సత్యనారాయణరెడ్డి
పాలకవీడు	కట్టయ్య
సూర్యాపేట	శ్రీనివాస్‌గౌడ్



మద్దిరాల మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో నూతన ఎంఈవో టి.వెంకటనారాయణను సన్మానిస్తున్న అధికారులు

యాదాద్రి లడ్డూ ప్రసాదాల్లో పూర్తి నాణ్యత

మదర్ డెయిరీ ద్వారా నెయ్యి సరఫరా

యంత్రాలతో నిత్యం తయారీ


ఆలయ ఈవో భాస్కరరావు వెల్లడి



లడ్డూ ప్రసాదం తయారీని పరిశీలిస్తున్న ఆలయ ఈవో భాస్కరరావు



లడ్డూ ప్రసాదాలు



నెయ్యి

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: 'తెలంగాణలో ప్రసిద్ధి చెందిన యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్ర ప్రాధాన్యం, విశిష్టతలను మరింత పెంచే దిశగా దేవుడి ప్రసాదాల తయారీలో కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నాం. ఎప్పటికప్పుడు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి, భక్తులకు విక్రయిస్తున్నాం'.. అని యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానం కార్యనిర్వహణ అధికారి భాస్కరరావు 'న్యూస్‌టుడే'కు తెలిపారు.

'యాదాద్రి క్షేత్ర సందర్శనకు వచ్చే భక్తులు లడ్డూ ప్రసాదాల కొనుగోలుకు అత్యంత ఆసక్తి చూపిస్తారు. నమ్మక, విశ్వాసాలకు తగ్గట్లే నాణ్యతలో ఎలాంటి లోపం జరగకుండా దినుసులను ప్రభుత్వ సంబంధిత శాఖ ధ్రువీకరణతోనే ప్రసాదాల తయారీకి వినియోగిస్తున్నాం. నిత్యం వంద గ్రాముల లడ్డూలను 25 వేల నుంచి 28 వేల వరకు తయారీ చేస్తున్నాం. ఇంకా అవసరమైతే అప్పటికప్పుడు సిద్ధం చేసే సామర్థ్యం యంత్రాల ద్వారా ఉంది. లడ్డూ తయారీకి మదర్ డెయిరీ ద్వారా కేజీ రూ.609 నెయ్యిని అవసరానికి తగ్గట్లు తెప్పించుకుంటాం. ఆ నెయ్యిని వెంటనే టెస్టింగ్ చేసిన ధ్రువీకరణ పత్రాన్ని డెయిరీ నిర్వాహకులు పంపిస్తారు. వచ్చిన నెయ్యి నాణ్యతా ప్రమాణాలు తెలుసుకునేందుకు నాచారంలోని ప్రభుత్వ ల్యాబ్‌కు పంపిస్తున్నాం' అని పేర్కొన్నారు.

భోగ్ సర్టిఫికెట్:

ఈ క్షేత్రంలో విక్రయించే ప్రసాదాలు పూర్తి నాణ్యతా ప్రమాణాలు కలిగినవని చెప్పడానికి కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ పరిధిలోని ఆహార భద్రత ప్రమాణాల ప్రాధికార సంస్థ (ఎఫ్ఎస్ఎస్ఏఐ) జాతీయ సర్టిఫికెట్ భోగ్ (బ్లిస్ ఫుల్ హైజీన్ ఆఫరింగ్ టు గాడ్) గుర్తింపు ఉంది.

చిరు ధాన్యాలతో:

చిరు ధాన్యాలతో తయారీ చేసే లడ్డూ ప్రసాదాలను విక్రయిస్తున్నారు. 80 గ్రాముల మిల్లెట్స్ లడ్డూ ధర రూ.40, ఇక 200 గ్రాముల బరువు కలిగిన పులిహోర ప్రసాదం రూ.30, 500 గ్రాముల బరువు కలిగిన పెద్ద లడ్డూ రూ.150కి విక్రయిస్తారు.

లడ్డూ తయారీకి వాడే సరకులు:

లడ్డూ ప్రసాదం తయారీకి శాస్త్ర రీత్యా వాడే సరకులను దిట్టం అంటారు. ఒక కేజీ లడ్డూకు నెయ్యి 900 గ్రాములు, చక్కెర 2 వేల గ్రాములు, శనగపిండి వెయ్యి గ్రాములు, కాజు 75 గ్రాములు, కిస్మిస్ 50 గ్రాములు, ఇలాచి 10 గ్రాములు, పచ్చ కర్పూరం రెండు గ్రాములు, జాజికాయ రెండు గ్రాములు.

◆ పై దినుసుల ద్వారా వంద గ్రాముల లడ్డూ 45 తయారవుతాయి. ఈ ఆలయ లడ్డూ రుచి, నాణ్యత తగ్గకుండా, ఐదు రోజుల నుంచి ఒక వారం రోజుల వరకు నిల్వ ఉంటుంది.

అరచేతిలో.. అంతర్జాలంలో..

ఎస్పీడీసీఎల్ యాప్ ద్వారా 19 రకాల సేవలు

రోజురోజుకూ సాంకేతిక వినియోగం పెరుగుతుండటంతో ప్రభుత్వ రంగ సంస్థలు అటు వైపు అడుగులు వేస్తున్నాయి. విద్యుత్తు శాఖ లోనూ సాంకేతికతను జోడించింది. బిల్లు చెల్లింపుతో పాటు 19 రకాల సేవలను చరవాణి ద్వారా అందించడానికి 'ఎస్పీడీసీఎల్' అనే యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు.

-భానుపురి, న్యూస్‌టుడే

డౌన్‌లోడ్ ఇలా..

ఎస్పీడీసీఎల్ యాప్‌ను ప్లేస్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఈ- మెయిల్ ఐడీతో లాగిన్ అవ్వాలి. యూఎస్సీ సంఖ్యను నమోదు చేయగానే తెర మీద పలు అంశాలతో కూడిన ఎంపిక కనిపిస్తుంది. వీటిలో సమస్యలపై ఫిర్యాదు చేయొచ్చు. కావాలంటే అది పరిష్కారమైందో లేదో తెలుసుకోవచ్చు.

ముందే బిల్లు తెలుసుకోవచ్చు

ప్రతి నెల మీటర్ రీడింగ్ ప్రకారం ఎన్ని యూనిట్ల కరెంటు వినియోగించారు.. ఎంత బిల్లు వస్తుందో చాలా మందికి అవగాహన ఉండదు. యాప్ ద్వారా ఎన్ని యూనిట్లకు ఎంత బిల్లు వస్తుందనే వివరాలు ముందుగానే తెలుసుకోవచ్చు. ఆధార్ లింక్, చరవాణి నంబరు నమోదుతో యాప్‌లోనే విద్యుత్తు బిల్లు చెల్లించటంతోపాటు గతంలో చెల్లించిన బిల్లులను సైతం చూసుకోవచ్చు.

ఫిర్యాదు.. సూచనలు

వినియోగదారుడి పేరు, లోడు, మార్పు, టారిఫ్ వివరాలు, ఏ కేటగిరికి ఎంత ఛార్జి, గృహ, గృహేతర, పరిశ్రమలకు ఎంత బిల్లు వసూలు చేస్తారు అనే విషయాలు తెలుసుకోవచ్చు. విద్యుత్తును ఎలా పొదుపు చేయాలి. ఎక్కడైనా ఏదైనా ప్రమాదం జరిగితే జీపీఎస్ లోకేషన్ ఆధారంగా చరవాణిలో ఫోటో తీసి పంపి దాని వివరాలను నమోదు చేసే సంబంధిత అధికారికి వెళ్తుంది. వారు స్పందించి చర్యలు తీసుకుంటారు. కరెంటు ప్రమాదాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై ఫీడ్‌బ్యాక్‌తోపాటు అత్యవసర సమయంలో సంప్రదించాల్సిన టోల్‌ఫ్రీ నంబరును కూడా యాప్‌లో పొందుపరిచారు. వినియోగదారుడు తన సమస్యను ఫిర్యాదు ద్వారా అధికారులకు తెలపవచ్చు. ఇందుకు మీటర్ నంబరుతో సమస్యను నమోదు చేసి పంపించాలి.



వివిధ రకాల సదుపాయాలు కలిగిన యాప్

ఆత్మహత్య కాదు.. హత్యాచారమే: డీఎస్పీ

మిర్యాలగూడ, న్యూస్‌టుడే: ప్రేమించిన యువతి అడ్డుతొలగించుకునేందుకు ఆమెపై మరికొందరితో అత్యాచారం చేసి పాశవికంగా హత్య చేసిన కేసులో రూపావత్ నాగు, రూపావత్ బుజ్జి, రమావత్ క్రాంతికుమార్‌ను బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు పంపుతున్నట్లు మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్ రాజు తెలిపారు. కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు.

◆ దామరచర్ల మండలం పుట్టలగడ్డ గ్రామానికి చెందిన 19 ఏళ్ల యువతిని అదే గ్రామానికి చెందిన రూపావత్ నాగు రెండేళ్లుగా ప్రేమ పేరుతో నమ్మించి శారీరకంగా కలిసి రెండు సార్లు గర్భస్రావం చేయించాడు. ఈ విషయమై యువతి తల్లిదండ్రులు నాగు తల్లిదండ్రులను కలిసి వివాహం జరిపించాలని కోరగా అందుకు అంగీకరించలేదు. కొంతకాలంగా నాగు సదరు యువతి చరవాణి నంబరును బ్లాక్ చేసి దూరం పెడుతున్నాడు.

◆ ఈనెల 14న సదరు యువతి నాగు వద్దకు వెళ్లి పెళ్లి చేసుకోవాలని నిలదీసింది. యువతిని మాయమాటలతో నమ్మించిన రూపావత్ నాగు అతని తల్లి బుజ్జి, బావ రమావత్ క్రాంతికుమార్‌లు ఊరిబయట మాట్లాడుకుందాం అని తీసుకెళ్లారు.

◆ అక్కడ బుజ్జి కాపలా ఉండగా నాగు, క్రాంతి కుమార్‌లు యువతిపై పలుమార్లు అత్యాచారానికి పాల్పడి.. గొంతు నొక్కి చంపి చెట్టుకు వేలాడదీసి సదరు యువతి బలవన్మరణానికి పాల్పడినట్లు చిత్రీకరించారు. 15వ తేదీ ఉదయం యువతి మృతదేహాన్ని పరిశీలించిన పోలీసులు అనుమానంతో విచారణ చేపట్టగా హత్యాచారం విషయం వెలుగు చూసింది.

◆ బుధవారం ఉదయం వాడపల్లి ఎస్సై రవి జాన్‌పహాడ్ రోడ్డుపై వాహనాలు తనిఖీ చేస్తుండగా రూపావత్ నాగు, బుజ్జి, రమావత్ క్రాంతిలు కనిపించారు.. అదుపులోకి తీసుకున్నారు. కాగా ఇదే కేసులో పలువురు అనుమానితులపై విచారణ జరుపుతున్నామని డీఎస్పీ రాజశేఖర్‌రాజు తెలిపారు. కేసు విచారణ వేగంగా పూర్తి చేసిన గ్రామీణ సీఐ వీరబాబు, వాడపల్లి ఎస్సై రవి సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రాజశేఖర్ రాజు, సీఐ వీరబాబు

పోగు పోసుకుంటున్న జీవితాలు

చండూరు, న్యూస్‌టుడే: అక్షరాలు నేర్వకపోయినా.. గడ్డి పరకల కలయికను చూసి పడుగు పేకలు కలిపి మానవ ప్రపంచానికి వస్త్రాలు నేస్తూ చేనేత రంగంలో రాణిస్తున్నారు చండూరుకు చెందిన పలువురు చేనేత మహిళలు. ఆ రంగానికి ఆదరణ తగ్గి ఉపాధి అంతంతమాత్రంగానే ఉన్నా.. కులవృత్తిని వీడలేక.. వేరే పని చేయలేక.. కుటుంబానికి ఆసరాగా ఉంటుందని మరికొందరు.. వృత్తిని చేపడుతున్నారు.

ఉపాధి కల్పిస్తున్నాం...

– చిలుకూరి యశోద

మాది చండూరు. భర్త చిలుకూరి రామకృష్ణ సుమారు 50 మందికి మగ్గం పని అప్పగిస్తారు. దీంతో ఆ 50 కుటుంబాలకు ఉపాధి లభిస్తుంది. వీరితో పాటు అదనంగా మరో 10 మంది మహిళలు చిటికిలు కట్టడం, రంగులు అద్దడం, డిజైన్‌లు గీయడం, మగ్గం నేయడం వంటి పనులు చేస్తుంటారు. వారితో పాటు నేను కూడా నేత పని చేస్తూ డిజైన్లు గీస్తుంటాను. మేము రూ.లక్షల్లో పెట్టుబడులు పెట్టి చేనేత చీరలు తయారు చేస్తుంటే ప్రింటెడ్ కంపెనీలు యథేచ్ఛగా మార్కెట్లలోకి వస్తున్నాయి. దీంతో మా వస్త్రాలు ఖరీదు కావడం లేదు. దీంతో మాపై ఆధారపడిన చేనేత కుటుంబాలకు పని కల్పించడం భారంగా మారింది.



ఆర్థిక ఇబ్బందులు లేవు

– ప్రసన్న



నా భర్త ప్రైవేట్ వ్యాపారం నిర్వహిస్తుంటారు. ఆయనకు వచ్చే సంపాదనతో కుటుంబం గడవడం కష్టంగా ఉంది. దీంతో 14 ఏళ్లుగా మాస్టర్ వీవర్‌ల వద్ద చేనేత పని (రంగులు అద్దడం, చిటికిలు కట్టడం, డిజైన్‌లు గీయడం) చేస్తుంటాను. రోజు ఎనిమిది గంటలు పని చేస్తే రూ.600 చెల్లిస్తారు. ప్రతి రోజు పని దొరుకుతుంది. నేను మా భర్త ఇద్దరం పని చేయడం వల్ల ఎటు వంటి ఆర్థిక ఇబ్బందులు లేవు.

భర్తకు తోడుగా...

–గజం పల్లవి



నేను, నా భర్త ఇద్దరం చండూరుకు చెందిన మాస్టర్ వీవర్ చిలుకూరి రామకృష్ణ దగ్గర పని చేస్తుంటాం. ఇద్దరికి రోజూ చెరో రూ.600 చొప్పున కూలీ చెల్లిస్తుంటారు. గతంలో మేం సొంతంగా చీరలు తయారు చేసే వాళ్లం. చేనేత వస్త్రాలకు ఆదరణ తగ్గడంతో పెట్టుబడి పెట్టలేక వేరే పని చేయలేక మా కులవృత్తి వీడలేక మాస్టర్ వీవర్ వద్ద పని చేస్తూ కుటుంబాన్ని గడుపుతున్నాం.

ఎస్‌జీఎఫ్ ఫుట్‌బాల్ జట్ల ఎంపిక పోటీలు 28న

ఆలేరు, న్యూస్‌టుడే: ఎస్‌జీఎఫ్ ఫుట్‌బాల్ అండర్-17 నల్గొండ ఉమ్మడి జిల్లా బాలురు, బాలికల జట్ల ఎంపిక పోటీలు ఈ నెల 28న ఆలేరులో జరుగుతాయని ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి బెజ్జం బాలకృష్ణ బుధవారం ఆలేరులో చెప్పారు. పోటీలలో పాల్గొనే వారు 01.01.2008 తర్వాత జన్మించిన వారై ఉండాలన్నారు. ఆసక్తిగల వారు ఉదయం 9గంటలకు ఆలేరు జడ్పీఉన్నత పాఠశాల క్రీడా మైదానానికి చేరుకోవాలని తెలిపారు. పూర్తి వివరాలకు ఎస్‌జీఎఫ్ కార్యనిర్వాహక కార్యదర్శి జి. మధుసూదన్ 9000989671 చరవాణి నెంబరులో సంప్రదించాలన్నారు.

ఉమ్మడి జిల్లాలో 12 మంది ఎస్సైలకు స్థానచలనం

నల్గొండ నేరవిభాగం, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లాలో 12 మంది ఎస్సైలకు స్థాన చలనం జరిగింది. ఈ మేరకు బుధవారం డీఐజీ కార్యాలయం నుంచి జిల్లా ఎస్పీ కార్యాలయాలకు ఆదేశాలు జారీ అయ్యాయి. బదిలీ అయిన ఎస్సైల వివరాలు ఇలా ఉన్నాయి.

పేరు	ప్రస్తుతం	బదిలీ స్థానం
యస్‌కే యాకూబ్	వీఆర్ సూర్యాపేట	డీసీఆర్‌బీ సూర్యాపేట
వి. మహేశ్వర్	డీఎస్‌బీ నల్గొండ	డీఎస్‌బీ సూర్యాపేట
వీ. వెంకటేశ్వర్లు	వీఆర్ నల్గొండ	డీఎస్‌బీ సూర్యాపేట
యస్‌కే సైదులు	డీసీఆర్‌బీ నల్గొండ	కోదాడ టౌన్
ఎస్. కృష్ణయ్య	మిర్యాలగూడ టౌన్	మాడ్గులపల్లి
జీ. శోభన్‌బాబు	మాడ్గులపల్లి	వీఆర్ నల్గొండ
డి. వెంకటేశ్వర్లు	డీసీఆర్‌బీ సూర్యాపేట	వేములపల్లి
డి. విజయ్ కుమార్	వేములపల్లి	వీఆర్ నల్గొండ
పి. లోకేశ్ కుమార్	సూర్యాపేట వన్ టౌన్	మిర్యాలగూడ రూరల్
ఎన్. సందీప్‌రెడ్డి	నల్గొండ వన్ టౌన్	మిర్యాలగూడ రూరల్-2
వి. శేఖర్	మిర్యాలగూడ వన్ టౌన్	అడవిదేవులపల్లి
బి. సాయిప్రశాంత్	సీసీఎస్ సూర్యాపేట	తిప్పర్తి

ప్రమాదవశాత్తు కాలువలో పడి ఇద్దరి గల్లంతు

నిడమనూరు, న్యూస్‌టుడే: సాగర్ ఎడమకాలువలో దుస్తులు ఉతికే క్రమంలో ప్రమాదవశాత్తు అందులో పడి యువతీయువకుడు గల్లంతైన ఘటన నిడమనూరు మండల పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. ప్రత్యక్షసాక్షులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. త్రిపురారానికి చెందిన వేమవరపు సాయి(25) సొంతగ్రామంలో కూరగాయాల దుకాణం నడిపిస్తున్నాడు. అతడు వచ్చేవారంలో భవాని మాలధారణ చేయాలనే ఉద్దేశంతో ఇంట్లోని దుస్తులను ఉతకడానికి తనకు సాయంగా అతడి దుకాణంలో పనిచేస్తున్న త్రిపురారానికి చెందిన మేదరి శైలజ(30), అవిరెండ్ల రమాదేవిలను తీసుకుని సాయంత్రం నాలుగున్నరకు బొక్కమంతలపహాడ్ సమీపంలోని ఎడమకాలువ వద్దకు వెళ్లాడు. కాలువ మెట్ల మీద నిలబడి దుస్తులు ఉతుకుతుండగా ప్రమాదవశాత్తు శైలజ, సాయి కాలువలో జారి పడ్డారు. నీటి ఉద్ధృతికి వారు కొట్టుకుపోతుండగా.. వారిని కాపాడేందుకు ప్రయత్నించిన రమాదేవీ కాలువలో పడింది. ముగ్గురు కొట్టుకుపోతుండగా కాలువపై అక్కడే ఉన్న స్థానికుడు ధర్మారపు జానయ్య.. ధర్మారపు సైదులు సాయంతో రమాదేవికి చీర అందించి కాపాడారు. మిగిలిన ఇద్దరిని కాపాడే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. సాయికి కొన్నేళ్ల క్రితం వివాహం కాగా.. కుమారుడు ఉన్నాడు. మనస్పర్థల కారణంగా అతడి భార్య కొన్ని రోజులుగా పుట్టింటి వద్దే ఉంటోంది. గల్లంతైన మరో మహిళ మేదరి శైలజకు వివాహమై ముగ్గురు కుమార్తెలున్నారు. ఆమె భర్త జానయ్య సుతారి మేస్త్రీగా పనిచేస్తున్నాడు. నిడమనూరు ఎస్సై గోపాల్‌రావు, ఏఎస్సై రమేష్ సిబ్బందితో కలిసి గాలింపు చర్యలు చేపట్టారు.



వేమవరపు సాయి



మేదరి శైలజ

ఎత్తుకు తగ్గ బరువున్నానా.. మేడమ్..!

పోషణ మాసోత్సవాల సందర్భంగా.. ఐసీడీఎస్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలలో నిర్వహించిన కార్యక్రమంలో డాక్టర్ కల్యాణి ఆయా కేంద్రాల పరిధిలోని చిన్నారులు వయసుకు తగ్గ బరువు, ఎత్తుకు తగ్గ బరువు ఉన్నారో పరీక్షించారు. వారి తల్లిదండ్రులకు పోషకాహారంపై అవగాహన కల్పించారు.

– న్యూస్‌టుడే, హుజూర్‌నగర్



కరవు నేలకు గోదారి.. పూజలతో ప్రణమిల్లి..!



మల్లన్నసాగర్ జలాశయం నుంచి గోదావరి జలాలు వదలడంతో.. తుర్కపల్లి మండలంలోని గంధమల్ల చెరువు నిండింది. అలుగు పోస్తుండటంతో ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య బుధవారం గంగకు పూజలు చేస్తున్న దృశ్యమిది.

–న్యూస్‌టుడే, తుర్కపల్లి



కేఆర్పీపురం వద్ద ఎడమ కాల్వకు గండిపడిన చోట ఏర్పాటు చేసిన ఇసుక బస్తాలు

పాలేరు వరకు నీటి విడుదల

నడిగూడెం, న్యూస్‌టుడే: సాగర్ ఎడమ కాల్వలో బుధవారం రాత్రి పాలేరు వరకు సాగు నీరు విడుదల చేశారు. ఎడమ కాల్వకు రెండు చోట్ల గండ్లు పడటంతో కాల్వలకు సాగునీటి విడుదలను నిలుపుదల చేశారు. అనంతరం ఎడమ కాల్వ పరిధిలో 128 కి.మీ. వద్ద క్రాస్ బండ్ ఏర్పాటు చేసి అక్కడివరకు సాగునీరు విడుదల చేశారు. గండి పరిసర ప్రాంతంలో సాగులో ఉన్న పంట పొలాలు ఎండుతున్నాయని మంత్రి ఉత్తమ్ పర్యటనలో రైతులు ఆందోళన వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. దీంతో ఎడమ కాల్వకు పూర్తి స్థాయిలో సాగునీరు విడుదల చేయాలని మంత్రి అధికారులను ఆదేశించడంతో క్రాస్ బండ్‌ను అధికారులు పొక్లెయిన్‌తో బుధవారం రాత్రి తొలగించారు. దీంతో ఎడమ కాల్వ పరిధిలో పాలేరు వరకు సాగర్ నీరు చేరేందుకు మార్గం సుగమమైంది. 132 కి.మీ. వద్ద గండి పూడ్చిన అధికారులు కాల్వ కట్ట పైవరకు ఇసుక బస్తాలను రక్షణ గోడగా ఏర్పాటు చేశారు. ఇంకా రెండు అడుగుల మేర బస్తాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. ప్రస్తుతం కాల్వలో 5 నుంచి 6 అడుగుల మేరకే నీటి ప్రవాహం కొనసాగుతోంది. కాల్వలో నీటి మట్టం పెరిగేలోగా ఇసుక బస్తాల ఏర్పాటు పూర్తవుతుందని, ఈ లోగా నీటి విడుదలకు సమస్య లేదని భావించి అధికారులు కాల్వకు నీరు విడుదల చేశారు. గండి ప్రాంతం వరకు సాగు నీరు రావడంతో 25 రోజులుగా సాగునీటికి నోచుకోని కాగితరామచంద్రాపురం రైతులు హర్షం వ్యక్తం చేశారు.

చికెన్ ధరలు

ఫాంరేటు	125–00
రిటైల్	147–00
డ్రెస్డ్	213–00
స్కిన్‌లెస్	243–00

క్రోచెట్ ఈవెంట్‌లో గిన్నిస్ వరల్డ్ రికార్డు




గిన్నిస్ వరల్డ్ రికార్డు అందుకుంటున్న గుండా సంతోషి

దేవరకొండ, న్యూస్‌టుడే: క్రోచెట్ ఈవెంట్‌లో దేవరకొండ పట్టణానికి చెందిన వీరమళ్ల కృష్ణయ్య కుమార్తె గుండా సంతోషి, ఆమె బృందం వరల్డ్ రికార్డ్ కైవసం చేసుకుంది. ఏపీలోని విశాఖపట్టణానికి చెందిన మహిళ మనోవికాస్ అండ్ క్రియేషన్స్ ఆధ్వర్యంలో ఏటా నిర్వహించే క్రోచెట్ తయారీలో గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకున్నారు గుండా సంతోషి. ఆ సంస్థ గతేడాది నవంబరు నుంచి ఈ ఏడాది ఆగస్టు వరకు మొత్తం 450 మందితో చిన్నారులు, యువతులు, వృద్ధులతో కలిసి అతి తక్కువ సమయంలో 58112 క్రోచెట్స్‌ను ప్రదర్శించడంతో ఈ రికార్డును దక్కించుకున్నారు. గిన్నిస్ రికార్డ్ లండన్ ప్రతినిధి స్వప్నిల్ డంగారికర్ పరిశీలించి ఈ రికార్డును ధ్రువీకరించారు.

ఆ కార్యాలయాలు మళ్లీ వచ్చేస్తున్నాయ్!

మిర్యాలగూడ, న్యూస్‌టుడే: ప్రాథమిక, మాధ్యమిక విద్యలను మరింత బలోపేతం చేసేందుకు, పాఠశాలల నిర్వహణపై పర్యవేక్షణ పెంచేందుకు ప్రభుత్వం జిల్లా ఉప విద్యాధికారి కార్యాలయాలను తిరిగి ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తుంది. 2014లో తెలంగాణ ఏర్పాటైన తరువాత అప్పటి ప్రభుత్వం 2015లో జిల్లా ఉప విద్యాధికారి కార్యాలయాలను ఎత్తివేసింది. మండల విద్యాధికారులే ఒకటి నుంచి పది తరగతుల వరకు పాఠశాలలను పర్యవేక్షించే ఏర్పాటు చేశారు. తెలంగాణలో 10 జిల్లాలను 33 జిల్లాలకు పెంచటంతో అదనంగా జిల్లాలకు 21 మంది డీఈవోలు, 28 మంది డిప్యూటీ ఈవోలు, 59 మంది ఎంఈవోలు, ఐదుగురు ఏడీలు అవసరమని ప్రతిపాదించారు. దీనిలో భాగంగా ఎంఈవోలను అన్ని మండలాలకు రెండు రోజుల క్రితం కేటాయించగా జిల్లా ఉపవిద్యాధికారి కార్యాలయాలను సైతం ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు సమాచారం.

✦ ఉమ్మడి జిల్లాలో గతంలో ఐదు రెవెన్యూ డివిజన్ కేంద్రాల్లో జిల్లా ఉపవిద్యాధికారి పోస్టులు ఉండగా.. అదనంగా మూడు చోట్ల కోదాడ, హుజూర్‌నగర్, చౌటుప్పల్‌లో ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. అన్ని చోట్ల జిల్లా ఉప విద్యాధికారి పోస్టులు ప్రారంభమైతే ఒకటి నుంచి ఐదు తరగతుల వరకు ఎంఈవోలు, ఆరు నుంచి పదో తరగతి వరకు జిల్లా ఉపవిద్యాధికారులు పర్యవేక్షించనున్నారు.



మిర్యాలగూడలో ఖాళీగా ఉన్న జిల్లా ఉపవిద్యాధికారి కార్యాలయం

ఉమ్మడి జిల్లాలో ఉపవిద్యాధికారి కార్యాలయాలు ఇవే:

- నల్గొండ జిల్లాలో.. మిర్యాలగూడ, నల్గొండ, దేవరకొండ
- సూర్యాపేట జిల్లాలో గతంలో ఉన్న సూర్యాపేట కార్యాలయం పునరుద్ధరించటంతో పాటు అదనంగా కోదాడ, హుజూర్‌నగర్.
- యాదాద్రి భువనగిరి జిల్లాలో గతంలో ఉన్న భువనగిరి కార్యాలయాన్ని పునరుద్ధరించటంతో పాటు.. చౌటుప్పల్

ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వస్తే ప్రారంభిస్తాం: భిక్షపతి, డీఈవో

జిల్లా ఉపవిద్యాధికారి కార్యాలయాలను ప్రారంభించమని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చిన వెంటనే ప్రారంభిస్తాం. ప్రస్తుతం ఎంఈవో పోస్టులు పూర్తి స్థాయిలో భర్తీ చేశారు. అన్ని చోట్ల అధికారులు విధుల్లో చేరారు.

కోదాడ

•కోదాడ •హుజూర్‌నగర్

ఒకే చోట ఉండేలా జాబితా సవరించండి

మోతె, న్యూస్‌టుడే: గ్రామంలో ఓటు హక్కు కలిగిన కుటుంబ సభ్యులందరూ ఒకే వార్డులో ఉండేలా జాబితాను త్వరితగతిన సవరించాలని జడ్పీ సీఈవో అప్పారావు, ఇన్‌ఛార్జి డీపీవో నారాయణరెడ్డి కార్యదర్శులను ఆదేశించారు. మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఓటరు జాబితా కుటుంబ మ్యాపింగ్ విధాన సరళిపై గ్రామ కార్యదర్శులతో బుధవారం ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు. ఒక గ్రామానికి చెందిన ఓటరు మరో గ్రామ ఓటరుగా నమోదై ఉన్నవి గుర్తించి సొంత గ్రామ జాబితాలో చేర్చాలని ఆదేశించారు. సకాలంలో ఈ పనులు పూర్తిచేయకుంటే చర్యలు తప్పవన్నారు. ప్రత్యేకాధికారి సీతారాములు, ఇన్‌ఛార్జి ఎంపీడీవో ఆంజనేయులు పాల్గొన్నారు.

ఎంఈవోగా బాధ్యతలు

నేరేడుచర్ల, న్యూస్‌టుడే: నేరేడుచర్ల ఎంఈవోగా దిర్శించర్ల గెజిటెడ్ హెచ్.ఎం. సత్యనారాయణరెడ్డి బుధవారం పూర్తి అదనపు బాధ్యతలు స్వీకరించారు.

చిలుకూరు: మండల నూతన ఇన్‌ఛార్జి ఎంఈవోగా మండలంలోని బేతవోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గురవయ్య బుధవారం బాధ్యతలను స్వీకరించారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM) 80085 50363 96030 18889

కోదాడ పట్టణం, న్యూస్‌టుడే:

? కోదాడ ఆర్టీసీ డిపో ఎక్స్‌ప్రెస్ బస్సులు బరాఖత్ గూడెం వద్ద ఆపడం లేదు. దీంతో నడిగూడెం, మునగాల మండలాల ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.
– జానిపాషా, నడిగూడెం

✔ కోదాడ డిపో ఎక్స్‌ప్రెస్ బస్సులను ఆపుతాం.
– డిపో మేనేజర్ శ్రీహర్ష

పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

నడిగూడెం, న్యూస్‌టుడే: పౌష్టికాహారంతోనే గర్భిణులు, చిన్నారులు సంపూర్ణ ఆరోగ్యవంతులవుతారని తహసీల్దార్ సరిత, కోదాడ సీడీపీవో పారిజాతం అన్నారు. బుధవారం నడిగూడెం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలోని అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో నిర్వహించిన సామూహిక సీమంతం, అన్నప్రాశన, అక్షరాభ్యాసం కార్యక్రమాల్లో పాల్గొని మాట్లాడారు.

మఠంపల్లి: పౌష్టికాహార వారోత్సవాల సందర్భంగా మఠంపల్లి సెక్టార్ పరిధిలో మండల కేంద్రంలోని ఓ వేడుకల మందిరంలో నిర్వహించిన ప్రదర్శన ఆకట్టుకుంది. జిల్లా శిశుసంక్షేమశాఖ అధికారి నరసింహారావు పాల్గొన్నారు.



మఠంపల్లిలో ప్రతిజ్ఞ చేస్తున్న జిల్లా శిశుసంక్షేమ శాఖ అధికారి నరసింహారావు తదితరులు

జిల్లాలు దాటి.. ప్రతిభ చాటి

అంతా గ్రామీణ వాతావరణంలో పెరిగినవారే. కానీ వారి ప్రతిభ నేడు రాష్ట్ర, జాతీయస్థాయిలకు చేరుతోంది. వీరి వాటతీరు ఆయా ప్రాంతాలకే కాక జిల్లాకు కూడా వన్నె తెచ్చే విధంగా ఉండటం విశేషం. వాలీబాల్, కబడ్డీ, ఖోఖో ఆటలలో మెరికల్లాంటి విద్యార్థులు ఎదుగుతుండటం వారు ఆటలపై పెడుతున్న శ్రద్ధకు అద్దం పడుతుంది. ముఖ్యంగా వ్యాయామ ఉపాధ్యాయులు, వారి తల్లిదండ్రులు ఎక్కువ శ్రద్ధచూపడంతో విద్యార్థులు బాగా రాణిస్తున్న పరిస్థితి ఉంది. అలా హుజూర్‌నగర్ నియోజకవర్గం నుంచి రాష్ట్రస్థాయి పోటీలలో ప్రతిభ చాటి జాతీయ పోటీలకు వెళ్తామని విశ్వాసం వ్యక్తం చేస్తున్న క్రీడాకారులు హుజూర్‌నగర్ మండలం కరక్కాయలగూడెంలో జరుగుతున్న డివిజన్ స్థాయి పోటీలకు వచ్చిన సందర్భంగా వారిని 'న్యూస్‌టుడే' పలకరించింది.

హుజూర్‌నగర్ గ్రామీణం, హుజూర్‌నగర్, న్యూస్‌టుడే:

ఆత్మవిశ్వాసంతో..



మఠంపల్లి మండలం బిల్యానాయక్‌తండాకు చెందిన **బానోతు జయ** పూర్తిగా గ్రామీణ వాతావరణంలో పెరిగింది. చిన్నతనం నుంచి ఆటలపై ఉన్న మక్కువతో పాఠశాలలో ఆటలలో ప్రతిభ కనబర్చింది. అండర్-14 విభాగంలో డివిజన్‌స్థాయిలో గత సంవత్సరం మంచి ప్రతిభ కనబర్చి జిల్లాకు ప్రాతినిధ్యం వహించి రాష్ట్రపోటీలలో ఆడి ప్రతిభ చాటింది. జయ ఇప్పుడు రాష్ట్రపోటీలకు ఎంపిక అవుతానని ఆత్మవిశ్వాసం వ్యక్తం చేసింది.

వాలీబాల్‌లో రాణిస్తూ..



హుజూర్‌నగర్ విజయ విద్యా మందిర్ ఉన్నత పాఠశాలకు చెందిన **హర్షవర్దన్** వాలీబాల్‌లో మంచి ప్రతిభ కనబర్చుతున్నాడు. గత సంవత్సరం అండర్-14 విభాగంలో డివిజన్, జిల్లా, రాష్ట్రస్థాయిలో ఆడిన హర్షవర్ధన్ ఈసారి అండర్-17 విభాగంలో ఆడుతున్నాడు. ఈసారి కూడా రాష్ట్రస్థాయిలో ఆడి మంచి ప్రతిభ కనబర్చి జాతీయ పోటీలకు ఎంపిక అయ్యేందుకు కసరత్తు చేస్తున్నట్లు తెలిపాడు.

విజయ లక్ష్యంతో ..



మఠంపల్లికి చెందిన **బొమ్మకంటి వినయ్** అండర్-17 విభాగంలో వాలీబాల్ ఆడుతున్నాడు. గత సంవత్సరం అండర్-17 విభాగంలో ఆడిన వినయ్ ఈసారి కూడా జిల్లాకు ప్రాతినిధ్యం వహించి రాష్ట్రస్థాయిలో ఆడి జాతీయ పోటీలలో పాల్గొనాలనే లక్ష్యంతో ఉన్నట్లు తెలిపాడు.

ఖోఖో ఆటలో..



మఠంపల్లి మండలం కొత్తతండాకు చెందిన **భూక్యా కావ్య** మఠంపల్లిలోని కస్తూర్బా విద్యార్థిని. ఖోఖో ఆటలో తనదైన శైలిలో రాణిస్తుంది. అండర్-14 విభాగంలో జిల్లా, రాష్ట్రస్థాయిలలో ఆడిన కావ్య ఈసారి కూడా రాష్ట్రస్థాయిలో ఆడి జాతీయ పోటీలలో ఆడాలనే లక్ష్యంతో శిక్షణ తీసుకుంటున్నట్లు తెలిపింది.

'జమిలి పేరుతో రాష్ట్రాల హక్కులను కాలరాసే ప్రయత్నం'

హుజూర్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే: జమిలి ఎన్నికల పేరుతో రాష్ట్రాల హక్కులను కాలరాసేందుకు భాజపా ప్రభుత్వం కుట్రలు చేస్తుందని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు పల్లె వెంకటరెడ్డి అన్నారు. అమరవరం గ్రామంలో బుధవారం జరిగిన సీపీఎం గ్రామ మహాసభలో మాట్లాడారు. దేశంలో ఉన్న సెక్యులర్ పార్టీలు, రాష్ట్రాల హక్కులను కాపాడేందుకు ప్రాంతీయ పార్టీలు ఏకమై జమిలి ఎన్నికలను తిప్పి కొట్టాలన్నారు. దేశ ప్రజలను విచ్ఛినం చేసేందుకు రకరకాల ప్రయత్నాలు చేస్తుందన్నారు. అనంతరం గ్రామ కార్యదర్శిగా షేక్ ఖాసీంను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యుడు దుగ్గి బ్రహ్మం, మండల కార్యదర్శి హుస్సేన్, మురళి, షేక్ సైదా, తదితరులు పాల్గొన్నారు.



అమరవరంలో జెండా ఎగురవేసి మాట్లాడుతున్న పల్లె వెంకటరెడ్డి

జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక

నడిగూడెం, న్యూస్‌టుడే: మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలు, నివారణ చర్యలపై బుధవారం నడిగూడెం కేజీబీవీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మునగాల, నడిగూడెం మండలాల స్థాయి విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వపోటీలు నిర్వహించారు. మండల స్థాయిలో ప్రతిభ కనపర్చిన విద్యార్థులు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. టి.ప్రియ, టి.నవ్య, బి.వినీల, అనూశ్రీ, అనూష, ఐశ్వర్య, కె.ధనుంజయ, కె.అనుశ్రీ, జి.వంశీలు జిల్లా స్థాయికి ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ విజయనాయక్ తెలిపారు.

ఫార్మసిస్ట్ దినోత్సవం



విద్యార్థులు చేసిన ప్రయోగాలను పరిశీలిస్తున్న ఫార్మసిస్ట్, ఇంజినీరింగ్ ప్రిన్సిపల్స్ ఉమామహేశ్వరరావు, రాము

చిలుకూరు, న్యూస్‌టుడే: మిట్స్ మహిళా ఫార్మసీ కళాశాలలో ఫార్మసిస్ట్ దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ మధిర ప్రీతిరెడ్డి మాట్లాడుతూ నేటి ప్రపంచంలో ఫార్మసీ విద్యకు చాలా విలువ, ప్రాధాన్యం ఉందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు న్యూట్రికల్ సైన్స్‌లో పలు ఆవిష్కరణలు చేశారు.

కోదాడ పట్టణం: స్థానిక డిప్యూటీ డీఎంహెచ్‌వో కార్యాలయంలో ప్రపంచ ఫార్మసిస్ట్ డేను నిర్వహించారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో నిరంజన్ మాట్లాడుతూ ఆరోగ్య సంరక్షణలో ఫార్మాసిస్టుల పాత్ర కీలకమన్నారు. అనంతరం ఫార్మాసిస్టులను సన్మానించారు. కాపుగల్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు ధర్మతేజ, జిల్లా ఫార్మాసిస్టు అధ్యక్షులు వాణి, తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతపై చైతన్యం అవసరం



మోతె: మామిళ్లగూడెంలో అవగాహన కల్పిస్తున్న సీఈవో అప్పారావు, ఇన్‌ఛార్జి డీపీవో నారాయణరెడ్డి

మోతె, న్యూస్‌టుడే: పల్లెల్లో పరిసరాల పరిశుభ్రతపై ప్రజలు చైతన్యం కావాలని, ఈ వర్షాకాలం సీజన్‌లో జాగ్రత్తలు పాటిస్తే సీజనల్ వ్యాధుల నుంచి దూరంగా ఉండవచ్చని జడ్పీ సీఈవో అప్పారావు అన్నారు. మామిళ్లగూడెంలో బుధవారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికులను సత్కరించారు.

హుజూర్‌నగర్: మూడో వార్డులో మిద్దెతోటను పెంచుతూ పచ్చదనాన్ని కాపాడుతున్న జయలావణ్యదేవి, వెంకటేశ్వర్లు దంపతులను పుర వైస్ ఛైర్మన్ సంపత్‌రెడ్డి, కమిషనర్ యాకుబ్ పాషా సన్మానించారు. అనంతరం 4వ వార్డులో పనికిరాని వస్తువులతో అందమైన వస్తువులు తయారు చేస్తున్న వై.విద్యను సన్మానించారు.

నడిగూడెం: నడిగూడెంలో గ్రామ పంచాయతీ సిబ్బందికి త్రిపురవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించారు.

నేరేడుచర్ల: నేరేడుచర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులు, అధ్యాపకులు మానవ హారంగా నిలిచి స్వచ్ఛత ప్రతిజ్ఞ చేశారు.

చింతలపాలెం: అందరి భాగస్వామ్యంతోనే పరిశుభ్రత మెరుగుపడుతుందని జడ్పీ సీఈవో అప్పారావు, డీపీవో నారాయణరెడ్డి అన్నారు. చింతలపాలెంలో నిర్వహించిన స్వచ్ఛత కార్యక్రమంలో మాట్లాడారు.

కోదాడ: నిత్యం పారిశుద్ధ్య పనుల్లో నిమగ్నమవుతున్న పుర కార్మికుల ఆరోగ్య పరిరక్షణకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని పుర ఛైర్‌పర్సన్ ప్రమీల అన్నారు. పుర కార్యాలయంలో కార్మికులకు ఉచితంగా ఆరోగ్య పరీక్షల శిబిరం ప్రారంభించి మాట్లాడారు.

విద్యుదాఘాతంతో యువకుడి దుర్మరణం

కోదాడ, న్యూస్‌టుడే: విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి చెందిన ఘటన బుధవారం కోదాడ పెద్దచెరువులో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం పట్టణానికి చెందిన గుడిమల్ల సతీష్(32) బంధువులతో కలిసి పెద్ద చెరువులో కరెంటు తీగతో చేపలు పట్టేందుకు వెళ్లారు. ఈ క్రమంలో విద్యుత్తు తీగ చేతికి తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. భార్య అపర్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని పట్టణ సీఐ రాము తెలిపారు.

గుండెపోటుతో మాజీ సర్పంచి మృతి



గరిడేపల్లి, న్యూస్‌టుడే: మండల పరిధిలోని ఎల్బీనగర్ గ్రామపంచాయతీ మాజీ సర్పంచి **అన్నె మోహన్‌రావు(65)** గుండెపోటుతో బుధవారం ఉదయం మృతిచెందారు. తెదేపా పార్టీ బలపర్చిన సమయంలో సర్పంచిగా గెలుపొందారు. గ్రామాభివృద్ధికి, పార్టీకి ఎనలేని సేవ చేశారని ఆ పార్టీ నాయకులు పేర్కొన్నారు. ఆయన మృతి పట్ల నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు సంతాపం తెలిపారు.

టైరు పేలి.. అదుపు తప్పిన కారు

మోతె, న్యూస్‌టుడే: టైరు పేలి కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొన్న ఘటన సూర్యాపేట-ఖమ్మం జాతీయ రహదారిపై మోతె సమీపంలో బుధవారం చోటుచేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. హైదరాబాద్ వైపు నుంచి ఖమ్మం వెళుతున్న కారు మోతె సమీపంలో వంతెన పైకి రాగానే టైరు పంక్చరై అదుపుతప్పింది. ఆ సమయంలో డ్రైవరు చాకచక్యంగా వ్యవహరించడంతో డివైడర్‌ను ఢీకొని నిలిచింది. దీంతో ప్రమాద సమయంలో కారులో ప్రయాణిస్తున్న ముగ్గురికి చిన్న చిన్న గాయాలు మినహా ఏమీ కాకపోవడంతో అక్కడ చేరినవారంతా ఊపిరి పీల్చుకున్నారు.

వరద బాధితురాలికి బాల్యమిత్రుల సాయం

మఠంపల్లి, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడలో ఇటీవల వచ్చిన వరదల్లో సర్వం కోల్పోయిన బాల్య స్నేహితురాలి కుటుంబానికి నాటి మిత్రులు ఆర్థిక సాయం అందించి ఆదుకున్నారు. మఠంపల్లి వీవీ ఉన్నత పాఠశాలలో 2001-02లో పదో తరగతి చదువుకున్న విద్యార్థుల్లో భీమిశెట్టి నాగలక్ష్మి విజయవాడలో ఉంటూ భర్త చేస్తున్న చిరుద్యోగంతోనే కుటుంబాన్ని నెట్టుకొస్తున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా వరదలు ముంచెత్తి నాగలక్ష్మి ఉంటున్న అద్దె ఇంట్లో సామగ్రి సహా సర్వం కోల్పోయారు. విషయాన్ని తెలుసుకున్న స్నేహితులు రూ.36 వేలు నగదు, క్వింటాకు పైగా బియ్యం, నూనె డబ్బాను బుధవారం స్వయంగా అందజేసినట్లు చెప్పారు.

బలవంతపు భూసేకరణ నిలిపివేయండి

మఠంపల్లి, న్యూస్‌టుడే: సింహపురి ఎన్‌సీఎల్ కర్మాగారానికి రైల్వే లైన్ ఏర్పాటు చేసేందుకు మఠంపల్లి నుంచి 12కి.మీ.మేర చేపడుతున్న భూ సేకరణను తక్షణం నిలిపివేయాలని బాధిత గిరిజన రైతులు కోరుతున్నారు. తమ నుంచి బలవంతంగా భూములు తీసుకోవాలని ప్రయత్నిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాతల నాటి నుంచి వారసత్వంగా వచ్చిన భూములే తమ జీవనానికి ఆధారమని వేడుకుంటున్నారు. ఈమేరకు తహసీల్దార్ మంగకు బుధవారం రామచంద్రాపురంతండా, భోజ్యతండా గ్రామాలకు చెందిన రైతులు వినతి పత్రాన్ని ఇచ్చిన అనంతరం గుర్రంబోడు భూ పరిరక్షణ సమితి అధ్యక్షుడు ఇస్లావత్ బాలాజీనాయక్ మాట్లాడారు. దశాబ్దాలుగా కబ్జాలో ఉన్న 540 సర్వే సంఖ్యలోని భూములతో పాటు ఉన్న కొద్దిపాటి పట్టా భూములే వారికి జీవనాధారమన్నారు. గతంలో కర్మాగారం కోసం భూములు ఇచ్చిన రైతులకూ 40 సంవత్సరాలుగా న్యాయం జరగలేదన్నారు. ఎకరం, రెండెకరాలే ఉన్న పేదల నుంచి భూములు తీసుకునే ప్రయత్నాలు విరమించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కాగా రెవెన్యూ అధికారులు భూసేకరణ అనివార్యమని మార్కెట్ విలువను చెల్లిస్తామని చెబుతున్నారు.

ప్యాక్స్‌కు తాళం వేసి రైతుల నిరసన



తాళం వేసి నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

చిలుకూరు, న్యూస్‌టుడే: చిలుకూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం(ప్యాక్స్) పరిధిలో అన్ని రకాలుగా అర్హత ఉండి, అధికారుల లోపం, నిర్లక్ష్యంతో తమకు రుణమాఫీ కాలేదని సంఘ కార్యాలయానికి తాళం వేసి బుధవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ విషయం జిల్లా పాలనాధికారి దృష్టికి తీసుకెళ్లినా తమకు న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎలాగైనా రుణమాఫీ వచ్చేలా చూడాలని డిమాండ్ చేస్తూ సంఘం కార్యాలయంలో డైరెక్టర్లు, సిబ్బంది ఉండగానే తాళం వేశారు. దీంతో ప్యాక్స్ ముందు కొంత సేపు ఘర్షణ వాతావరణం నెలకొంది. విషయం తెలుసుకొన్న కోదాడ గ్రామీణ సీఐ రజితారెడ్డి ఘటన స్థలానికి చేరుకొని బాధిత రైతులకు నచ్చ చెప్పి తాళం తీయించారు. తరువాత చిలుకూరు రాణాకు రైతులను, కార్యాలయ సిబ్బందిని తరలించి జరిగిన ఘటనపై విచారణ చేశారు. అలాగే ఘటనను కవరేజ్ చేయడానికి వచ్చిన మీడియాపై కూడా కొంత అసహనం వ్యక్తం చేశారు. సంఘం సీఈవో లక్ష్మీనారాయణను వివరణ కోరగా సంఘంలో 40 రైతులకు రుణమాఫీ కాకపోవడానికి సాంకేతిక లోపం కారణమని, ఈ విషయాన్ని జిల్లా అధికారులకు తెలియజేశామని, రుణమాఫీ వచ్చేలా చర్యలు తీసుకొంటామని, జిల్లా స్థాయి అధికారులు తెలిపినట్లు సీఈవో చెప్పారు.

'అధికారుల పర్యవేక్షణ లోపంతో నాణ్యత లేమి'

మునగాల, న్యూస్‌టుడే: గణపవరం గ్రామ శివారులోని వాగుపైన నిర్మిస్తున్న వంతెన నిర్మాణ పనుల్లో భాగంగా అధికారులు, గుత్తేదారుడి నిర్లక్ష్యంతో డైవర్షన్ రహదారి నిర్మించక పోవడం వల్ల ప్రజలకు అవస్థలు తప్పడం లేదని మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. వంతెన నిర్మాణ పనులను బుధవారం పరిశీలించి మాట్లాడారు. డైవర్షన్ రహదారి లేకపోవడంతో వాహనదారులు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వంతెన నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదని ఆరోపించారు. తక్షణమే అధికారులు పరిశీలన చేయాలని కోరారు. భారాస మండల అధ్యక్షుడు రమేష్, రైసస మండల కన్వీనర్ అజయ్‌కుమార్, పీఏసీఎస్ ఛైర్మన్ సీతారాములు పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్

రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలి

నేరేడుచర్ల, న్యూస్‌టుడే: రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని పురఛైర్మన్ బచ్చలకూరి ప్రకాశ్ బస్తీదవాఖానా డాక్టర్ సాయిరాంకి సూచించారు. రామాపురంలో గల బస్తీదవాఖానాను బుధవారం వైస్‌ఛైర్‌పర్సన్ సరిత, కౌన్సిలర్ చిన్నవెంకటరెడ్డితో కలిసి పరిశీలించారు. ఆసుపత్రికి సిబ్బందిని కేటాయించక పోవడం, పీహెచ్‌సీ నుంచి సరిగా మందులు సరఫరా జరగక, ఆసుపత్రికి నీటి సరఫరాలేక ఇబ్బంది పడుతున్నట్లు డాక్టర్ వారి దృష్టికి తెచ్చారు. మందుల విషయమై ఛైర్మన్ డీఎంహెచ్‌వో కోటాచలంతో చరవాణిలో మాట్లాడి సరిపడా మందులు అందించాలని కోరగా ఆయన సానుకూలంగా స్పందించినట్లు చెప్పారు.

ఆటలతో నాయకత్వ లక్షణాలు

హుజూర్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే: క్రీడల వల్ల విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెరుగుతాయని బూరుగడ్డ పీఏసీఎస్ ఛైర్మన్ వెంకటేశ్వర్లు, ఎక్సైజ్ సూపరింటెండెంట్ సోమిరెడ్డి అన్నారు. కరక్కాయలగూడెం గ్రామంలో రెండు రోజులుగా జరుగుతున్న ఎస్‌జీఎఫ్ నియోజకవర్గ స్థాయి అండర్-14, 17 ఖోఖో, వాలీబాల్ క్రీడల ముగింపు కార్యక్రమంలో మాట్లాడారు. విజేతలను అభినందించారు. ఎస్‌జీఎఫ్ కార్యదర్శి రవి, పాఠశాల ఇన్‌ఛార్జి హెచ్‌ఎం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



కరక్కాయలగూడెంలో ఖోఖో ఆడుతున్న బాలికలు

సంక్షిప్త సమాచారం

రిజర్వేషన్ కల్పించాలి.. మునగాల గ్రామీణం: దివ్యాంగుల హక్కుల చట్టాన్ని ఉల్లంఘించి సీఎం రేవంత్‌రెడ్డి తీసుకొచ్చిన ఎంఎస్ఎంఈ పాలసీని తక్షణమే సవరించి వారికి 5శాతం రిజర్వేషన్ కల్పించాలని భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు రాజేశ్ అన్నారు. కలకోవలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు.

సంతాపం.. మునగాల: తిమ్మారెడ్డిగూడెం గ్రామానికి చెందిన భారాస నాయకుడు మల్‌రెడ్డి ప్రతాపరెడ్డి మాతృమూర్తి రోషమ్మ మృతి బాధాకరమని మాజీ ఎమ్మెల్యే మల్లయ్యయాదవ్ అన్నారు. ప్రతాప్‌రెడ్డిని పరామర్శించి, కుటుంబీకులకు సానుభూతి తెలిపారు.

ఎన్నిక.. నేరేడుచర్ల: దర్జీ షాపుల యూనియన్ నూతన కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ సంఘం ఒక ప్రకటనలో తెలిపింది. అధ్యక్షుడిగా షేక్ చాంద్‌పాషా, ప్రధానకార్యదర్శిగా శ్రీనివాసాచారి ఎన్నికయ్యారు.

మేళ్లచెరువు: ఎర్రగట్టు తండాలో సీపీఎం గ్రామ శాఖ మహాసభ నిర్వహించారు. పార్టీ మండల కార్యదర్శి సైదులు మాట్లాడారు. నూతన కమిటీ కార్యదర్శిగా స్వామిని ఎన్నుకున్నారు.

రెగ్యులర్ చేయండి.. గరిడేపల్లి: కస్తూర్బా విద్యాలయాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయినుల సర్వీస్‌ను రెగ్యులర్ చేయాలని, మినిమం టైం స్కేల్ వర్తింపచేయాలని తాపస్ సంఘ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి టి.పెంటయ్యా డిమాండ్ చేశారు. గరిడేపల్లి, నేరేడుచర్ల, పాలకవీడు మండలాల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు.

పంపిణీ.. నేరేడుచర్ల: నేరేడుచర్ల జడ్పీహెచ్ఎస్ విద్యార్థులకు వాసవీ, వనితాక్లబ్‌ల ఆధ్వర్యంలో దాత వెంకటేశ్వర్లు అందించిన రూ.4 వేల విలువైన రాత పుస్తకాలను క్లబ్ అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారావు పంపిణీ చేశారు.

అందజేత.. మునగాల గ్రామీణం, చింతలపాలెం: దొండపాడులోని జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు జగన్నాథపుర గ్రామ ఉపాధ్యాయుడు వక్కంతుల భరత్‌బాబు కబడ్డీ స్పోర్ట్స్ మెటీరియల్‌ను అందజేశారు.

వినతి.. చిలుకూరు: నారాయణపురం ఊరచెరువు కట్ట దగ్గర గల పలువురు గ్రామస్థులు తమకు ఇళ్ల స్థలాలు లేవని, తమకు స్థలాలు ఇవ్వాలని కోరుతూ తహసీల్దారు ధ్రువకుమార్‌కు బుధవారం వినతిప్రతాన్ని అందజేశారు. చెరువు కట్ట పక్కన తాత్కాలికంగా ఇళ్లు నిర్మించుకొని ఉన్నామని, ఇటీవల కురిసిన వర్షాలకు ఇళ్లు కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని తహసీల్దారు తెలిపారు.

స్వాగత వేడుకలు.. హుజూర్‌నగర్: విద్యార్థుల ఆట, పాటలతో ఫ్రెషర్స్ డేను విద్యార్థులు ఉత్సాహంగా.. ఉల్లాసంగా జరుపుకున్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం ఫ్రెషర్స్‌డే నిర్వహించారు.

అవగాహన.. నడిగూడెం: యువత మత్తు వీడితే భవిష్యత్ బంగారుమయవుతుందని స్థానిక ఎస్సై అజయ్‌కుమార్ అన్నారు. నడిగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో మత్తు పదార్థాలు, సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు.

ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి.. కోదాడ పట్టణం: ప్రతి ఉద్యోగి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని డిపో మేనేజర్ శ్రీహర్ష అన్నారు. ఆర్టీసీ డిపోలో ఆరోగ్య పరీక్షలను ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ టి.నాగశ్రీ, మెడికల్ సిబ్బంది, డిపో ఉద్యోగులు పాల్గొన్నారు.

బుర్కచర్ల గ్రామ కార్యదర్శి సస్పెన్షన్

మోతె, న్యూస్‌టుడే: మండలంలోని బుర్కచర్ల పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న రవీందర్ సస్పెండ్ అయినట్లు ఇన్‌ఛార్జి ఎంపీడీవో ఆంజనేయులు బుధవారం తెలిపారు. ఈ మేరకు కలెక్టర్ నుంచి ఉత్తర్వులు అందినట్లు పేర్కొన్నారు. స్వగ్రామంలో వ్యక్తిగతంగా ప్రభుత్వ భూఆక్రమణకు పాల్పడినట్లు ఉన్నతాధికారులకు అందిన ఫిర్యాదు నేపథ్యంలో సస్పెన్షన్‌కు గురైనట్లు తెలిపారు.

ఎట్టకేలకు నిర్మాణ పనులు షురూ



భవనం నిర్మించేందుకు ఇసుక, కంకర ఏర్పాటు చేసిన దృశ్యం

కోదాడ న్యూస్‌టుడే: పట్టణంలో నిర్మిస్తున్న ఎక్సైజ్ కార్యాలయ నూతన భవన నిర్మాణం పిల్లర్ల దశలోనే పనులు ఆగిపోయి నాలుగేళ్లు గడిచింది. ఈ నేపథ్యంలో ఈ నెల 20 'నాలుగేళ్లయినా నిర్మాణానికి నోచుకోలే' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో సదరు అధికారులు, గుత్తేదారుడు స్పందించి నిర్మాణ పనులు మొదలు పెట్టారు. పిల్లర్ల మధ్యలో పెరిగిపోయిన మొక్కలను తొలగించడం, ఇసుక, కంకర, తీసుకొచ్చి పనులు మొదలుపెట్టారు. త్వరితగతిన నిర్మాణ పనులు పూర్తి చేస్తామని అధికారులు తెలిపారు.

స్పందనకు వందనం

మూణ్నాళ్ల ముచ్చటేనా?



సాగర్ ఎడమ కాల్వ 128 కి.మీ వద్ద ఏర్పాటు చేసిన క్రాస్‌బండ్, దానిపై వేసిన సైఫన్ పైపులు

నడిగూడెం, న్యూస్‌టుడే:

ముందస్తు ప్రణాళిక లేదు.. సమన్వయ లోపం, ఆలస్యంగా తీసుకున్న నిర్ణయాలతో సాగర్ ఎడమ కాల్వ గండి బాధిత రైతులకు ఇబ్బందిగా మారడంతో పాటు, లక్షల రూపాయల ప్రజాధనం నిరుపయోగంగా మారిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ నెల 1న గండి పడింది. దీంతో కాలువకు నీటి విడుదల నిలుపుదల చేశారు. 15న పూడ్చివేత పనులు చేపట్టారు. కాల్వలకు సాగునీరు విడుదలలో జాప్యం జరుగుతుండటంతో పంట పొలాలు ఎండుతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేయడంతో, ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా రైతులకు సాగునీరు అందించాలని అధికారులు చర్యలు తీసుకున్నారు. దీనిలో భాగంగానే ఎడమ కాల్వ పరిధిలోని 128 కి.మీ. వద్ద కాలువలో అడ్డంగా క్రాస్ బండ్ ఏర్పాటు చేసి మునగాల హెడ్‌రెగ్యులేటర్ నుంచి నడిగూడెం మండల పరిధిలోని మూడు మేజర్లు, లిఫ్టులకు సాగునీరు విడుదల చేయాలని నిర్ణయించారు. రెండు రోజులు అధికారులు గుత్తేదారు మట్టి తరలించి క్రాస్‌బండ్ నిర్మాణం చేపట్టి, బండ్‌కు అడ్డంగా ఇసుక బస్తాలను పేర్చారు. ఎట్టకేలకు ఆదివారం సాయంత్రం వరకు మేజర్ కాల్వలకు సాగునీరు విడుదల చేశారు.

★ 128 కి.మీ. నుంచి 132 కి.మీ. వరకు సాగునీరు అందించేందుకు క్రాస్ బండ్ వద్ద రూ.లక్షల వ్యయంతో సైఫన్ ఏర్పాటుకు పైపులు కొనుగోలు చేసి ఏర్పాటు చేశారు. మంగళవారం గండి పూడ్చివేత పనులను పరిశీలించడానికి వచ్చిన మంత్రి ఉత్తమ్‌కు కాగితరామచంద్రాపురం పరిసర రైతులు సైఫన్‌ల ద్వారా తమకు నీరు అందడం లేదని, పొలాలు ఎండుతున్నాయని విన్నవించారు. దీంతో ఎడమ కాల్వలో జరుగుతున్న పనులను పూర్తి చేసి, బుధవారం కాల్వలకు పూర్తి స్థాయిలో సాగునీరు విడుదల చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. 128 కి.మీ. వద్ద ఏర్పాటు చేసిన క్రాస్ బండ్‌ను తొలగిస్తేనే కింది వైపునకు పాలేరు వరకు సాగర్ నీరు చేరుతుంది. దీంతో క్రాస్‌బండ్ మూణ్నాళ్ల ముచ్చటగానే మిగిలిందని, అవగాహన లోపంతో ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని స్థానిక రైతులు ఆరోపిస్తున్నారు.

ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం

నడిగూడెం, న్యూస్‌టుడే: ప్రజా సమస్యలపై సీపీఎం సమరశీల పోరాటాలు చేస్తుందని పార్టీ మండల కార్యదర్శి బి.సత్యనారాయణ అన్నారు. బుధవారం సిరిపురంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. అనంతరం గ్రామ శాఖ అధ్యక్షునిగా పి.వెంకటేశ్వర్లును ఎన్నుకున్నారు.

ఇసుక లారీ పట్టివేత

అనంతగిరి, న్యూస్‌టుడే: అక్రమంగా ఇసుకను తరలిస్తున్న లారీని పోలీసులు పట్టుకున్న ఘటన బొజ్జగూడెం గ్రామశివారులో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం శ్రీనివాస్, గోపీ అనే వ్యక్తులు లారీలో అక్రమంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి ఇసుకను తరలిస్తుండగా పట్టుబట్టారు. ఈ మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నవీన్‌కుమార్ బుధవారం తెలిపారు.

సినిమాలు కోదాడ పట్టణం, న్యూస్‌టుడే:
విష్ణురామ్: మత్తువదలరా-2, **శ్రీనివాస:** సరిపోదా శనివారం, **రంగా:** 35, **వెంకటేశ్వర:** కళింగ

ప్రత్యేక పూజలు

జాజిరెడ్డిగూడెం,న్యూస్‌టుడే: తిమ్మాపురంలోని శ్రీ అఖండ జ్యోతి స్వరూప శ్రీ సూర్యనారాయణ స్వామి ద్వాదశ ఆదిత్యాది క్షేత్రంలో బుధవారం శ్రీ వేదాంత రామకృష్ణాచార్యులు స్వామిజీ ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఆలయ నిర్వాహకులు తీర్థప్రసాదాలు అందించారు. సౌర ఆరాధకుడు జనార్దనస్వామి, నరేష్, అర్చకులు వికాస్ పాండే, అంకిత్ పాండే, శ్రీరామ్ పాండే పాల్గొన్నారు.


తిమ్మాపురంలోని శ్రీ సూర్య క్షేత్రంలో పూజా కార్యక్రమంలో పాల్గొన్న శ్రీ వేదాంత రామకృష్ణాచార్యులు

సూర్యాపేట

• సూర్యాపేట • తుంగతుర్తి

భానుపురి, న్యూస్‌టుడే:

? సూర్యాపేటలోని జాతీయ రహదారి నుంచి యాదాద్రి టౌన్‌షిప్‌కు వెళ్లేదారి అధ్వానంగా మారింది. గుంతలు పడటంతో వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరమ్మతులు చేపట్టాలి. –దయాకర్, సూర్యాపేట

✔మరమ్మతు చేపట్టి ఇబ్బందులు లేకుండా చూస్తాం. –యుగేందర్, ఆర్‌అండ్‌బీ ఏఈ, సూర్యాపేట

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM to 1 PM) సూర్యాపేట: 9154395978 తుంగతుర్తి: 80085 74450

సూర్యాపేట పురపాలిక, న్యూస్‌టుడే:

? సూర్యాపేటలోని మానసనగర్‌లో చెట్లకొమ్మలు విద్యుత్తు తీగలకు తాకి సరఫరాలో ఆటంకం ఏర్పడుతోంది. కొమ్మలు తీగలకు తాకి మంటలు రావటంతో కాలనీవాసులు ఇబ్బందులకు గురవుతున్నారు. వెంటనే తొలగించాలి. –చంద్రయ్య, మానసనగర్

✔ తొలగించి ఇబ్బందులు లేకుండా చూస్తాం. –యశ్వంత్, సూర్యాపేట పట్టణం–2, విద్యుత్తు ఏఈ

జేఎల్‌ఎం, సబ్ ఇంజినీర్ పోస్టులను నిలిపివేయాలని డిమాండ్

భానుపురి, న్యూస్‌టుడే: విద్యుత్తు శాఖలో ఆర్టిజన్స్ కన్వర్షన్ చేసే వరకు ప్రభుత్వం జేఎల్‌ఎం, సబ్ ఇంజినీర్ పోస్టులను నిలిపివేయాలని టీవీఏసీ ఐకాస జిల్లా సమన్వయకర్త చింతా ఎల్లయ్య డిమాండ్ చేశారు. సూర్యాపేట పరిధిలోని శాంతినగర్‌సబ్ స్టేషన్ బుధవారం నిరసన తెలిపి మాట్లాడారు. ఆర్టిజన్ల క్రమబద్ధీకరణ పేరుతో గత ప్రభుత్వం కాలయాపన చేసిందని, ఈ ప్రభుత్వం వారిని పక్కకుపెట్టి జేఎల్‌ఎం, సబ్ ఇంజినీరింగ్ పోస్టులు భర్తీ చేయటం సబబు కాదన్నారు. ఈ విషయమై గురువారం టీవీఏసీ ఐకాస ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన సమయంలో నిరసన తెలపనున్నట్లు తెలిపారు. పవన్ కుమార్, సోమయ్య, ముస్తఫా పాల్గొన్నారు.

కొత్తతరంతో బలోపేతం: ధర్మార్జున్

ఆత్మకూర్(ఎస్), న్యూస్‌టుడే: నేడు కొనసాగుతున్న డబ్బు, మద్యం రాజకీయాలకు చరమగీతం పాడాలని తెజస రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంట ధర్మార్జున్ పిలుపునిచ్చారు. మండలంలోని నెమ్మికల్‌లో బుధవారం నిర్వహించిన తెజస ఆత్మకూర్(ఎస్) మండల ప్లీనరిలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో విద్యావంతులు, తటస్థులతో కొత్తతరాన్ని ప్రోత్సహిస్తూ తెజసను బలోపేతం చేస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ ఉద్యమనేత కోదండరాం చేపట్టిన మహాయజ్ఞంలో ప్రతి కార్యకర్త సైనికుడిలా పోరాడాలని పిలుపునిచ్చారు. మండల అధ్యక్షుడు కొల్లు కృష్ణారెడ్డి అధ్యక్షతన సాగిన సమావేశంలో జిల్లా అధ్యక్షుడు గట్ల రమాశంకర్, కిరణ్‌కుమార్, శంకర్, చంద్రకాంత్, వినయ్‌గౌడ్, శ్రీనివాస్, రాములుగౌడ్, జనార్దన్ పాల్గొన్నారు.


నెమ్మికల్‌లో నిర్వహించిన తెజస మండల ప్లీనరీలో మాట్లాడుతున్న ధర్మార్జున్

బాలు గానం చిరస్మరణీయం

కుడకుడరోడ్డు(సూర్యాపేట), న్యూస్‌టుడే: మరణం లేని గాయకుడు పద్మశ్రీ ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం అని సుధాకర్ పీవీసీ ఎండీ మీలా మహాదేవ్, మనం వికాస వేదిక అధ్యక్షుడు పెద్దిరెడ్డి గణేష్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సుధా బ్యాంక్‌లో బుధవారం ఎస్పీ బాలు వర్ధంతిని నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మంది సంగీత అభిమానులను సంపాదించుకున్న బాలు గానం చిరస్మరణీయమన్నారు. ఆయనకు సూర్యాపేట సుధా బ్యాంక్, సుధాకర్ పీవీసీ కంపెనీకి అవినాభావ సంబంధం ఉందని గుర్తు చేశారు. ఆయన చిత్రపటానికి పూల మాల వేసి నివాళి అర్పించారు. సుధా బ్యాంక్ డైరెక్టర్లు కక్కిరేణి చంద్రశేఖర్, భాస్కర్, పొనుగోటి నిర్మల, ఇరిగి కోటేశ్వరి, అంజన్‌ప్రసాద్, రమేష్, మహంకాళి సోమయ్య, కృష్ణచారి పాల్గొన్నారు.


సూర్యాపేటలోని సుధా బ్యాంక్‌లో బాలసుబ్రహ్మణ్యం చిత్ర పటానికి నివాళి అర్పిస్తున్న మీలా మహాదేవ్, పెద్దిరెడ్డి గణేష్ తదితరులు

సూర్యాపేట అర్బన్: పాటలతో సంగీత ప్రియులను అలరించిన గొప్ప గాయకుడు ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం అని కళావేదిక అధ్యక్షుడు జూనియర్ ఘంటసాల బుర్రి వెంకటేశ్వర్లు, సామాజికవేత్త గుండా రమేష్ అన్నారు. జిల్లా కేంద్రంలోని బాలభవన్‌లో బాలు వర్ధంతిని నిర్వహించారు. సరిత, విజయ,హమిద్, సత్యం, ఉమారాణి, సాయికుమార్ పాల్గొన్నారు.

మాల్‌లో తనిఖీలు

సూర్యాపేట (తాళ్లగడ్డ), న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలోని ఓ మాల్‌లో జోనల్ ఫుడ్ కంట్రోలర్ వి. జ్యోతిర్మయి, జిల్లా ఆహార తనిఖీ అధికారి కిరణ్‌కుమార్ బుధవారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. పలు అనుమానిత ఆహార పదార్థాల నమూనాలను సేకరించి ప్రయోగశాలకు పంపిస్తున్నట్లు తెలిపారు. విడిగా విక్రయిస్తున్న టీపౌడర్‌లో కల్తీ ఉన్నట్లు అనుమానించి నమూనాలు సేకరించారు. ల్యాబ్ ఫలితాల ఆధారంగా చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు.


సూర్యాపేటలోని మాల్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న ఆహార తనిఖీ అధికారులు

అర్హతకు మించి వైద్యం చేయొద్దు: డీఎంహెచ్‌వో

జాజిరెడ్డిగూడెం, న్యూస్‌టుడే: ఆర్‌ఎంపీలు అర్హతకు మించి వైద్యం చేయొద్దని డీఎంహెచ్‌వో కోటాచలం అన్నారు. ఆర్వపల్లిలో ఓ క్లినిక్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అర్హతకు మించి వైద్యం చేస్తున్నాడని గుర్తించి క్లినిక్‌ను సీజ్ చేసినట్లు తెలిపారు. ఆర్‌ఎంపీలు కేవలం ప్రథమ చికిత్స చేసి అన్ని అర్హతలు ఉన్న వైద్యుని వద్దకు పంపించాలని పేర్కొన్నారు. ఆయన వెంట డిప్యూటీ డీఎంహెచ్‌వో చంద్రశేఖర్, తదితరులు ఉన్నారు.

అవీ ఇవీ

చెక్కు అందజేత.. జాజిరెడ్డిగూడెం: బొల్లంపల్లి గ్రామానికి చెందిన చినసాయన్న ఆరోగ్య సమస్యలతో హైదరాబాద్‌లోని నిమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయాన్ని స్థానిక కాంగ్రెస్ నాయకుడు కేసాని రాహుల్ ఎమ్మెల్యే మందుల సామేల్ దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన ఎమ్మెల్యే రూ.2.50 లక్షలు ఎల్‌వోసీని అందజేశారు.

దరఖాస్తుల ఆహ్వానం.. నాగారం: పసునూరు ఆదర్శ పాఠశాలలో గంటల ప్రాతిపదికన ఆంగ్లం బోధించుటకు పీజీటీ ఉపాధ్యాయుల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపల్ చంద్రబాబు తెలిపారు. అభ్యర్థులు సంబంధిత బోధన విషయంలో పీజీతో పాటు బీఈడీ పూర్తి చేసి ఉండాలన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఒరిజినల్, జిరాక్స్ పత్రాలతో ఈనెల 27న నిర్వహించే డెమోకు హాజరుకావాలని కోరారు.

కేజీబీవీ విద్యార్థులకు ప్లేట్ల పంపిణీ.. ఆత్మకూర్(ఎస్): మండలంలోని నశీంపేటకు చెందిన ముల్కలపల్లి అనసూయ, వెంకన్న దంపతులు వారి కుమారుడు ముల్కలపల్లి నాగరాజు జ్ఞాపకార్థం ఆత్మకూర్(ఎస్)లోని కేజీబీవీ పాఠశాల విద్యార్థినులకు స్టీల్ ప్లేట్లను బుధవారం పంపిణీ చేశారు. పాఠశాల ప్రిన్సిపల్ సోమిరెడ్డి సరస్వతి, వత్సవాయి లలిత, సైదులు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీలు.. తుంగతుర్తి: ఈనెల 27న ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మండల స్థాయి వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ప్రిన్సిపల్ ఎ.రాజమోహనరావు, కన్వీనర్ పి. నాగేశ్వర్‌రావు, పి.పుల్లయ్య, గణేశ్ పాల్గొన్నారు.

పరామర్శ.. పెన్‌పహాడ్: మండలంలోని గాజులమల్కాపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు బచ్చలకూర ముత్తయ్య(75) అనారోగ్యంతో మృతిచెందగా పార్టీ మండల అధ్యక్షుడు తూముల సురేష్‌రావు నివాళి అర్పించారు. మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు.

వ్యవసాయ మార్కెట్ ధరలు

భానుపురి, న్యూస్‌టుడే: సూర్యాపేట వ్యవసాయ మార్కెట్‌కు బుధవారం వచ్చిన వివిధ పంట ఉత్పత్తులకు పలికిన గరిష్ఠ, కనిష్ఠ ధరల వివరాలు(రూపాయల్లో)..

రకం	గరిష్ఠం	కనిష్ఠం
బీపీటీ	3221	2156
జైశ్రీరాం	3379	2056
ఐఆర్-64	2106	1836
హెచ్‌ఎంటీ	2986	1643
కందులు	9319	5356
పెసర	8619	3393
వేరుసెనగ	6519	4259

హస్తకళలు

కలకాలం కొనసాగేలా..!


సూర్యాపేట: తాపీమేస్త్రీ పనిలో శిక్షణ ఇస్తున్న నిపుణులు

సూర్యాపేట పట్టణం, న్యూస్‌టుడే: ఒకప్పుడు చేతి వృత్తిదారులకు గ్రామాల్లోనే ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉండేవి. మారుతున్న కాలానికి అనుగుణంగా హస్త కళాకారులు నూతన ఒరవడిని అందిపుచ్చుకోవడంలో వెనుకబడుతున్నారు. ఈ నేపథ్యంలో వారికి నైపుణ్య శిక్షణ అందించడంతో పాటు యంత్ర పరికరాలు(టూల్ కిట్లు) పంపిణీ చేయడం, తక్కువ వడ్డీకి రుణాలు అందించడానికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. ప్రధాన మంత్రి విశ్వకర్మ పథకం ద్వారా పట్టణంలో అర్హులైన హస్త కళాకారులకు ఉచితంగా శిక్షణ అందిస్తున్నారు.

మూడు విభాగాలుగా

ప్రధానమంత్రి విశ్వకర్మ పథకంలో భాగంగా ఎంపికైన వారికి వారం పాటు నిపుణులతో పలు హస్త కళారూపాల తయారీపై శిక్షణను మూడు విభాగాలుగా అందిస్తున్నారు. మొదటి చేతి వృత్తి కారుల నైపుణ్యాలను అంచనా వేయడం, రెండో ప్రాథమిక శిక్షణదీని ద్వారా నైపుణ్యాలు మెరుగుపడేలా చూస్తారు. మూడోది అధునాతన శిక్షణ ప్రాథమిక శిక్షణ పూర్తి చేసుకున్న వారు మరింత నైపుణ్యం సాధించేందుకు 15 రోజుల వరకు అధునాతన శిక్షణ అందిస్తారు. శిక్షణ కాలంలో రూ.4 వేలు అందించడంతో పాటు టూల్ కిట్టు కింద రూ.15 వేలు మంజూరు చేస్తున్నారు. అంతేకాకుండా తక్కువ వడ్డీకే రూ. లక్ష రుణం కేటాయిస్తున్నారు.

ఈ విభాగాల వారికి..

స్వయం ఉపాధి ప్రాతిపదికన సంప్రదాయ చేతి వృత్తిదారులు, హస్త కళాకారులు ఈ పథకం ద్వారా లబ్ధి పొందడానికి అర్హులు. వడ్రంగి, కుమ్మరి, సుత్తులు, కొడవళ్లు తయారీ చేసేవారు, శిల్పులు, స్వర్ణకారులు, చెప్పులు కుట్టేవారు, తాపీ మేస్త్రీలు, బొమ్మల తయారీ, నాయీ బ్రాహ్మణులు, చేప వలలు తయారీ చేసేవారు, తాళం చెవి తయారీదారులు, కార్పెంటర్, చాకలి వారికి శిక్షణ అందిస్తారు. కాగా ప్రస్తుతం పట్టణంలో తాపీ మేస్త్రీలు, కార్పెంటర్, దోబీలకు మాత్రమే శిక్షణ అందిస్తున్నారు. ఇప్పటికే వారికి మూడు పర్యాయాలు పూర్తి కాగా అందులో 80 మంది వరకు తర్ఫీదు పొందారు. తాజాగా నూతనంగా శిక్షణ అందించేందుకు సన్నాహాలు మొదలు పెడుతున్నారు.

ఇప్పటి వరకు శిక్షణ పొందిన వారి వివరాలు

పథకం	బృందాలు	సభ్యులు
దోబీ	4	30
కార్పెంటర్	3	25
సుతారీ మేస్త్రీ	2	25

ఈ కార్యక్రమం ద్వారా ఇప్పటికే పలువురు శిక్షణ పొంది యంత్ర పరికరాలు సైతం అందుకుని, రుణాలకు దరఖాస్తు చేసుకుంటున్నారు.

మెలకువలు నేర్చుకున్నా:

నల్లగంతుల వెంకటేశ్వర్లు, దోబీ, సూర్యాపేట



ప్రధానమంత్రి విశ్వకర్మ పథకం ద్వారా అందించే శిక్షణకు హాజరయ్యాను. అందులో ఎన్నో మెలకువలు నేర్చుకున్నా. కేంద్ర ప్రభుత్వం అందించే కార్యక్రమం ఎంతో బాగుంది. మాలాంటి నిరుపేదలకు ఎంతో ఉపయోగ పడుతుంది. అంతేకాకుండా ప్రభుత్వం అందించే రుణాలను సైతం సద్వినియోగం చేసుకుని సొంతంగా వ్యాపారం మొదలు పెడదామనుకుంటున్నా.

విద్యుత్తు సరఫరాలో నేడు అంతరాయం

మద్దిరాల, న్యూస్‌టుడే: దిర్శనపల్లి నుంచి ముకుందాపురం సబ్‌స్టేషన్ వరకు 33కేవీ ఇంటర్‌లింక్ వేస్తున్నందున గురువారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు రెడ్డిగూడెం, ముకుందాపురం సబ్‌స్టేషన్ పరిధిలో అన్ని గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని మద్దిరాల మండల ఏఈ సురేందర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు.

బస్సు డిపో ఏర్పాటు చేయాలని ధర్నా

తిరుమలగిరి, న్యూస్‌టుడే: తిరుమలగిరిలో బస్సు డిపో ఏర్పాటు చేయాలని కోరుతూ బస్సు డిపో సాధన కమిటీ ఆధ్వర్యంలో సూర్యాపేట-జనగాం ప్రధాన రహదారిపై ధర్నా నిర్వహించారు. కమిటీ అధ్యక్షుడు కడెం లింగయ్య మాట్లాడుతూ ఈ ప్రాంతంలో డిపో ఏర్పాటు చేస్తే మరింత అభివృద్ధి చెందుతుందని తెలిపారు. ఎస్.కె. యాకూబ్‌పాష, సోమన్న, రమేశ్, ప్రవీణ్, మల్లయ్య, సోమయ్య, యాకయ్య, శ్రీధర్ పాల్గొన్నారు.


తిరుమలగిరిలో ధర్నా చేస్తున్న బస్సు డిపో సాధన కమిటీ సభ్యులు

బదిలీ ఉపాధ్యాయినికి సన్మానం

పెన్‌పహాడ్, న్యూస్‌టుడే: అంకిత భావంతో విధులు నిర్వహించే ఉద్యోగులకు ప్రత్యేక గౌరవం లభిస్తుందని ఎంఈవో ఎన్.రవి, మండల నోడల్ అధికారి వస్రాం నాయక్ అన్నారు. మండలంలోని అనాజీపురం ఆదర్శపాఠశాల నుంచి బదిలీపై వెళ్తున్న ప్రిన్సిపల్ ప్రమీలను పాఠశాల సిబ్బంది ఆధ్వర్యంలో బుధవారం సన్మానించి మాట్లాడారు. ప్రిన్సిపల్ కోడి లింగయ్య, అన్నామేరీ, జబీన్, ఉమలత పాల్గొన్నారు.


అనాజీపురం ఆదర్శ పాఠశాలలో ప్రిన్సిపల్ ప్రమీలను సన్మానిస్తున్న ఎంఈవో రవి, నోడల్ అధికారి వస్రాం నాయక్

గిరిజన విద్యార్థులకు చేయూత

నూతనకల్: సోమ్లా తండా ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు సూర్యాపేటకు చెందిన గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు గ్రహీత డాక్టర్ పెండెం కృష్ణకుమార్ బుధవారం బ్యాగులు, ఆటవస్తువులు, మహనీయుల చిత్రపటాలు, దేశ రాష్ట్ర భౌగోళిక పటాలను అందించారు. విద్యార్థులకు చదువు, విజ్ఞానం ముఖ్యమని అభిప్రాయపడ్డారు. దాతను విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల సిబ్బంది సన్మానించారు. ప్రధానోపాధ్యాయులు బోగోజు శ్రీదేవి, సురేందర్ పాల్గొన్నారు.


విద్యార్థులకు బ్యాగులు, ఆటవస్తువులు అందిస్తున్న డా.పెండెం కృష్ణకుమార్

అంతరించిపోతున్న అలనాటి కళలు

తుంగతుర్తి గ్రామీణం, న్యూస్‌టుడే: కనమరుగవుతున్న పూర్వ కళలు.. వేగుచుక్క మాదిరి నేడు అక్కడక్కడ గ్రామాల్లో కన్పిస్తున్నాయి. మూడు రోజులగా భిన్న వేషధారణలతో గ్రామాల్లో సందడి చేస్తున్న ఈ జానపద కళాకారులను పగటి వేషగాళ్లుగా పిలుస్తారు. మహబుబాబాద్ జిల్లా తొర్రూర్‌కు చెందిన సత్యనారాయణ కుటుంబీకులు పొట్టకూటి కోసం ఇప్పటికీ తమపూర్వీకుల నుంచి నేర్చుకున్న కళనే నమ్ముకొని జీవనం సాగిస్తున్నారు. బుధవారం తుంగతుర్తి మండలం వెలుగుపల్లిలో వీధుల్లో బేతాలుడు, సూర్పణక వేషాలతో కనిపించారు.


బేతాలుడు, సూర్పణక వేషధారణలో కళాకారులు

ఆయిల్‌పామ్ సాగు లాభదాయకం


అనాజీపురంలో మొక్కలు నాటుతున్న పతంజలి ఆయిల్‌పామ్ సంస్థ జిల్లా మేనేజరు హరీష్

పెన్‌పహాడ్, న్యూస్‌టుడే: లాభదాయకంగా ఉండే ఆయిల్‌పామ్ సాగుపై రైతులు దృష్టి సారించాలని పతంజలి ఆయిల్‌పామ్ కంపెని జిల్లా మేనేజరు హరీష్ అన్నారు. మండలంలోని అనాజీపురం గ్రామంలో పోలేపల్లి మౌనిక వ్యవసాయ క్షేత్రంలో బుధవారం ఆయిల్ పామ్ మొక్కలు నాటి మాట్లాడారు. ఆయిల్ పామ్ సాగు వల్ల కూలీల ఖర్చు తగ్గడంతో పాటు కోతుల బెడద ఉండదని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే రాయితీలను సద్వినియోగం చేసుకొని వీటిని సాగు చేసి అధిక ఆదాయాన్ని పొందాలని సూచించారు. సంస్థ జూనియర్ మేనేజరు శశికుమార్, క్షేత్రసహాయకుడు లక్ష్మీ నారాయణ పాల్గొన్నారు.

హామీలను అమలు చేయాలి


లింగాల గ్రామంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు నెమ్మాది వెంకటేశ్వర్లు

పెన్‌పహాడ్, న్యూస్‌టుడే: కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీ పథకాలతో పాటు రైతు భరోసా, రైతు రుణమాఫీ వెంటనే అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు నెమ్మాది వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని లింగాల గ్రామంలో బుధవారం నిర్వహించిన పార్టీ శాఖా సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు గడుస్తున్నా ప్రజలకిచ్చిన హామీలు పూర్తిస్థాయిలో అమలుకావడం లేదని విమర్శించారు. అనంతరం సీపీఎం శాఖా కార్యదర్శిగా రణపంగ బుచ్చిరాములు రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కార్యదర్శి రణపంగ కృష్ణ, ఉస్మాన్‌అలీఖాన్, ముత్తయ్య, మధు, అనిల్, సైదులు, నాగయ్య, భిక్షం, నర్సయ్య పాల్గొన్నారు.

ఆటోపైకి దూసుకెళ్లిన ట్రాక్టర్

సూర్యాపేట నేరవిభాగం, న్యూస్‌టుడే: ఇద్దరు విద్యార్థులతో వెళ్తున్న ఆటోపైకి అదుపుతప్పి ట్రాక్టర్ దూసుకెళ్లిన ఘటన బుధవారం సూర్యాపేటలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మోతె మండలం నామవరం గ్రామానికి చెందిన డి. సందీప్ పాత వెంకటేశ్వర థియేటర్ వెనుక వీధి నుంచి ఇద్దరు చిన్నారులను పాఠశాలకు ఆటోలో తీసుకెళ్తుండగా ట్రాక్టర్ అదుపుతప్పి ఆటోపైకి దూసుకొచ్చింది. ఆటో కల్వర్టులోకి పడిపోవడంతో ట్రాక్టర్ టైర్లు పూర్తిగా ఆటోపైకి ఎక్కాయి. చిన్నారులిద్దరికీ ఎలాంటి గాయాలు కాకుండా బయటకు రావడంతో ప్రమాదం తప్పింది. ఆటో డ్రైవర్ సందీప్ ఆటోలో ఇరుక్కుపోయారు. విషయం తెలుసుకున్న పోలీసులు, 108 సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకొని క్రేన్ సాయంతో అరగంట పాటు శ్రమించి డ్రైవర్‌ను బయటకు తీశారు. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం సూర్యాపేట ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు సూర్యాపేట ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ తెలిపారు.


డ్రైవర్‌కు ప్రథమ చికిత్స అందిస్తున్న 108 సిబ్బంది

చిన్నారులకు వైద్య పరీక్షలు

తిరుమలగిరి, న్యూస్‌టుడే: క్రమం తప్పకుండా వైద్యపరీక్షలు చేయించుకోవాలని మండల వైద్యాధికారి ఎం.వందన అన్నారు. బుధవారం అంబేడ్కర్ నగర్‌లోని కమ్యూనిటీ హాల్‌లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో 'గ్రామ ఆరోగ్య పరిశుభ్రత పోషకాహార దినం ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా చిన్నారులకు వైద్యపరీక్షలు చేశారు. సూపర్‌వైజర్ కందుకూరి మంగమ్మ, స్వరూపరాణి, జ్యోతి, ప్రఫుల్లరాణి, పరీదా, అరుణ పాల్గొన్నారు.

జాజిరెడ్డిగూడెం: తిమ్మాపురం గ్రామంలో బుధవారం అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఎత్తుకు తగినట్లు బరువు ఉన్నాడా? తదితర వాటిపై పరీక్షలు చేశారు. సీడీపీవో శ్రీజ, అర్వపల్లి పీహెచ్‌సీ మణిదీప్, సూపర్‌వైజర్ లలిత, రాధ, అరుణ పాల్గొన్నారు.


తిరుమలగిరిలో వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యాధికారి డాక్టర్ వందన

దీన్‌దయాళ్ ఆశయ సాధనకు కృషి

భానుపురి, న్యూస్‌టుడే: భారతీయ జనసంఘ్ సిద్ధాంతకర్త పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని భాజపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వర్‌రావు అన్నారు. సూర్యాపేటలో బుధవారం దీన్‌దయాల్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించి మాట్లాడారు. దీన్‌దయాల్ అందించిన సేవలను కొనియాడారు. జుట్టుకొండ సత్యనారాయణ, నర్సింహ, కర్నాటి కిషన్, వీరేందర్, అబీద్, వెంకటరెడ్డి, సైదులు, లక్ష్మణరావు పాల్గొన్నారు.


సూర్యాపేటలో దీనదయాళ్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న భాజపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేశ్వరరావు, నాయకులు

'స్వచ్ఛదనం.. పచ్చదనం' అందరి బాధ్యత


మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పారిశుద్ధ్య కార్మికుడిని సన్మానిస్తున్న ఎంపీడీవో సత్యనారాయణరెడ్డి

మద్దిరాల గ్రామీణం, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'స్వచ్ఛదనం- పచ్చదనం' కార్యక్రమాన్ని బాధ్యతగా భావించి ప్రతి ఒక్కరూ పాల్గొనాలని ఎంపీడీవో సత్యనారాయణరెడ్డి అన్నారు. 'స్వచ్ఛతాహీ సేవా' కార్యక్రమంలో భాగంగా బుధవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పారిశుద్ధ్య కార్మికులను సన్మానించి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటిస్తేనే సీజనల్ వ్యాధులను నియంత్రించ వచ్చన్నారు. నూతనకల్, మద్దిరాల మండల విద్యాధికారులు రాములు నాయక్, తండు వెంకటనారాయణ, ఎంపీవో ఇబ్రహీం, ఏపీవో వెంకన్న పాల్గొన్నారు.

నాగారం: స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా నాగారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం ఎంపీడీవో ధార శ్రీనివాస్ పారిశుద్ధ్య కార్మికులను సన్మానించారు. ఆరోగ్య కేంద్రంలో ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. ఎంపీవో మారయ్య, వైద్యులు హర్షవర్ధన్, శ్రావణ్, నజియా, సరస్వతి, విమలమ్మ, అరుణకుమారి, రాంచంద్రు, వినోద పాల్గొన్నారు.

టీపీటీఎఫ్ సభ్యత్వ నమోదు

ఆత్మకూర్(ఎస్), న్యూస్‌టుడే: పెండింగ్‌లోని డీఏలను తక్షణమే మంజూరు చేయాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పేరం ముత్తయ్య, రాష్ట్ర కౌన్సిలర్ ఎస్‌కే.సుభానీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని కందగట్ల, గట్టికల్, ఏనుబాముల, ఆత్మకూర్(ఎస్), నెమ్మికల్, ఏపీకేతండా, పాతర్లపహాడ్, కాలిబావ్‌సింగ్‌తండాలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో బుధవారం టీపీటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా ఉపాధ్యక్షుడు పుప్పాల వీరన్న, వెంకన్న, చంద్రారెడ్డి, శ్రీనివాస్, నరసరాజు, కిషన్‌సింగ్, యూన్నీ, కవిత, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

టీపీయూటీఎఫ్ ఆధ్వర్యంలో..

సూర్యాపేట (మహాత్మాగాంధీ రోడ్డు): ఉపాధ్యాయుల సర్దుబాటుకు చేసిన మార్గదర్శకాలను ఉపసంహరించుకోవాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి యామా రమేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో వెంకటరాంపురం, సత్రం బజార్, కొత్తగూడెం బజార్, రాజీవ్ నగర్ తదితర ప్రాథమిక పాఠశాలలు, దాసాయిగూడెం ప్రాథమికోన్నత పాఠశాలు, జడ్పీ హెచ్‌ఎస్ బాలుర, బాలికల ఉన్నత పాఠశాల, కేజీబీవీ, ఆదర్శ పాఠశాలలో బుధవారం సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఉపేందర్, శ్రీదేవి, రవి కుమార్, రవి, రామాచారి పాల్గొన్నారు.

పైవంతెన నిర్మాణం చేపట్టవద్దు

తిరుమలగిరి, న్యూస్‌టుడే: తిరుమలగిరిలో తెలంగాణ చౌరస్తాలో పైవంతెన నిర్మాణం చేపట్టవద్దని బుధవారం భవన యజమానులు, వ్యాపారులు నిరసన చేపట్టారు. అనంతరం జాతీయ రహదారి పనుల పరిశీలనకు వచ్చిన ఇంజినీరింగ్ అధికారులను కలిసి వినతిపత్రాలు అందజేశారు. మాజీ ఎంపీపీ కొమ్మినేని సతీశ్‌కుమార్, ఆంజనేయులు, కడెం లింగయ్య, ప్రవీణ్, భాస్కర్, వీరమ్మ పాల్గొన్నారు

గోడపత్రికలు విడుదల

తిరుమలగిరి, న్యూస్‌టుడే: ఈనెల 29, 30 తేదీల్లో సూర్యాపేటలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించ తలపెట్టిన తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా మహాసభల గోడపత్రికలను బుధవారం తిరుమలగిరి జడ్పీఉన్నత పాఠశాలలో విడుదల చేశారు. సంఘం జిల్లా కార్యదర్శి సున్నపోజు సోమయ్య మాట్లాడుతూ ఉపాధ్యాయులు పెద్దఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు. ప్రధానోపాధ్యాయులు దామెర శ్రీనివాస్, వెంకన్న, ఉపేంద్ర, బోసుబాబు, ఎల్లయ్య, జానయ్య, యాదయ్య శ్రీనివాసచారి పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

నూతనకల్, న్యూస్‌టుడే: నూతనకల్ గ్రామశాఖ సీపీఎం కార్యదర్శిగా పొన్నం అబ్బయ్య ఎన్నికైనట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కొలిశెట్టి యాదగిరిరావు పేర్కొన్నారు. నూతనకల్‌లోని తొట్ల మల్సూర్ స్మారక భవనంలో బుధవారం ఆపార్టీ నిర్వహించిన గ్రామశాఖ సమీక్ష సమావేశంలో పాల్గొని కమిటీని వెల్లడించారు. మండల కార్యదర్శి కందాల దామోదర్‌రెడ్డి, రామ్మూర్తి, పూలమ్మ, ఉప్పలయ్య, ప్రభాకర్, మహేష్ పాల్గొన్నారు.


పొన్నం అబ్బయ్య

ఉపాధ్యాయుడి వితరణ

తిరుమలగిరి, న్యూస్‌టుడే: తిరుమలగిరి జడ్పీ ఉన్నత పాఠశాలలో రెండేళ్లుగా నీటి శుద్ధి కేంద్రం మరమ్మతులకు గురై నిరుపయోగంగా ఉంది. విద్యార్థులు తాగునీటికి ఇబ్బంది పడుతున్నారు. గమనించిన అదే పాఠశాల ఉపాధ్యాయుడు పులుసు అశోక్ రూ.30వేలు ఖర్చు చేసి దానికి మరమ్మతులు చేయించి బుధవారం ప్రారంభించారు.


నీటి శుద్ధి కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఉపాధ్యాయుడు పులుసు అశోక్